RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 246 మంగళవారం 30 సెప్టెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## భారత్‌తో కలిసి పనిచేస్తాం

బీజింగ్ : సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరత నెలకొల్పేం దుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు తమ సైన్యం సిద్ధమని చైనా ప్రకటించింది. రెండు దేశాల సైనిక భవిష్యత్ సంబంధాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఝూంగ్ జియావోగాంగ్ స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. అత్యంత పురాతన నాగరికతలు కలిగి ఉన్న ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాయన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.




షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్

# ఇక సై అంటే సై

తెలంగాణలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. అక్టోబర్ 9 నుంచి నవంబర్ 9 లోపు ఎన్నికల ప్రక్రియ ముగించనున్నట్లు ఎస్ఈసీ రాణికుముదిని వెల్లడించారు. 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 9 నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలుకానుండగా అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబర్ 27న రెండో విడత పోలింగ్ ఉంటుందని స్పష్టం చేశారు. ఇక ఈ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని తెలిపారు.

**5 దశల్లో ఎన్నికల ప్రక్రియ...** ఈ మేరకు మొత్తం 5 దశల్లో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించనుండగా మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికలకు పోలింగ్ నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదేరోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు విడుదల చేస్తామన్నారు. నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎస్ఈసీ అధికారి రాణికుముదిని స్పష్టం చేశారు. 31 జిల్లాల్లోని 565 మండలాల్లో రెండు విడతల్లో 5,749 ఎంపీటీసీ, 656 జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 23, 27న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలుంటాయి. అక్టోబర్ 31, నవంబర్ 4, 8 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. 12,733 గ్రామపంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**ముఖ్యమైన తేదీలివే.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు– తొలివిడత...** నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 9, స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 11, పరిశీలన: అక్టోబర్ 12, నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 15, ఎన్నికల తేదీ– అక్టోబర్ 23, ఓట్ల లెక్కింపు– నవంబర్ 11, ఎంపీటీసీ.

**జడ్పీటీసీ ఎన్నికలు– రెండో విడత..** నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 13, స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 15, పరిశీలన: అక్టోబర్ 16, నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 19, ఎన్నికల తేదీ– అక్టోబర్ 27 ఓట్ల లెక్కింపు– నవంబర్ 11,

**గ్రామ పంచాయతీ ఎన్నికలు– తొలి విడత...** నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 17, స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 19, పరిశీలన: అక్టోబర్ 20, నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 23
ఎన్నికల తేదీ, ఫలితాలు– అక్టోబర్ 31

**గ్రామ పంచాయతీ ఎన్నికలు–రెండో విడత...** నామినేషన్ల స్వీకరణ– అక్టోబర్ 21, చివరి తేదీ: అక్టోబర్ 23, పరిశీలన: అక్టోబర్ 24, నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 27, ఎన్నికల తేదీ, ఫలితాలు– నవంబర్ 4

**గ్రామ పంచాయతీ ఎన్నికలు–మూడో విడత...** నామినేషన్ల స్వీకరణ– అక్టోబర్ 25, చివరి తేదీ: అక్టోబర్ 27, పరిశీలన: అక్టోబర్ 28, నామినేషన్ల ఉపసంహరణ– అక్టోబర్ 31, ఎన్నికల తేదీ, ఫలితాలు– నవంబర్ 8




విజయవాడ, సెప్టెంబర్ 29: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనార్థం సాధారణ భక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. భక్తుల కోసం నిర్మిస్తున్న అన్న ప్రసాద భవనం మరో ఆరు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. సోమవారం ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో కొలువు తీరిన శ్రీదుర్గమ్మకి సీఎం చంద్రబాబు నాయుడు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం దేవాలయం బయట సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. రూ.25 కోట్లతో 1,500 మంది భక్తులు భోజనం చేసే విధంగా అన్న ప్రసాద భవనం నిర్మిస్తున్నామన్నారు. రూ. 27 కోట్లతో 3 నెలల్లో ప్రసాదం తయారీ కేంద్ర పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. అలాగే రూ.5.5 కోట్లతో ప్రధాన ఆలయం వద్ద పూజా మండపానికి సంబంధించిన నిర్మాణ పనులు చేపట్టామని సీఎం నారా చంద్రబాబు నాయుడు వివరించారు. ప్రభుత్వం తరపున దుర్గమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రజలకు సుఖ సంతోషాలు అందించాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. దుర్గమ్మ దయతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందని.. దీంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ జలకళతో ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలంతా ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని.. రాష్ట్ర సంపద పెరగాలని ఆయన ఆకాంక్షించారు. నవరాత్రుల సందర్భంగా ఇప్పటి వరకూ 8 లక్షల మంది భక్తులు.. దుర్గమ్మ వారిని దర్శించుకున్నారని వివరించారు. దుర్గమ్మ ఆశీస్సులతో ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను దుర్గమ్మ ఆశీర్వదించాలని కోరుకుంటున్నానని చెప్పారు.



## సరస్ మేళా.. గ్రామీణ స్ఫూర్తికి అద్దం పడుతోంది

హైదరాబాద్: శిల్పారామం పక్కన ఉన్న 'ఇందిరా మహిళా శక్తి బజార్'లో కొనసాగుతున్న సరస్ మేళాను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. "మహిళా స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టాళ్లు బాగున్నాయి. గ్రామీణ ప్రాంతాల స్ఫూర్తి, మార్కెటింగ్ ఇన్నోవేషన్‌కు ఈ మేళా అద్దం పడుతోంది. 20కిపైగా రాష్ట్రాల ప్రతినిధులు ఏర్పాటు చేసిన 150కిపైగా స్టాళ్లు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. తెలంగాణలోని నకాశీ చిత్రకళ నుంచి ఒడిశా పట్టచిత్రాల వరకు అన్నీ ఇక్కడ లభిస్తున్నాయి. మేళాను చక్కగా నిర్వహిస్తున్నారు. 'ఇందిరా మహిళా శక్తి' నినాదం ద్వారా 65 లక్షల మంది మహిళలు సంఘటితమవుతున్నారు. తెలంగాణలో మహిళా సాధికారత అనేది ఉద్యమంలా ముందుకు సాగడం సంతోషంగా ఉంది. నేను గతంలో పోచంపల్లిని సందర్శించాను.

అక్కడ లభించేవి కేవలం చీరలు, దుస్తులే కావు.. తెలంగాణ చరిత్ర సంస్కృతి" అని గవర్నర్ పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చి స్టాళ్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులను గవర్నర్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకుముందు మంత్రి సీతక్క గవర్నర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. మహిళా కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ పాల్గొన్నారు.




హైదరాబాద్: తెలంగాణ బతుకమ్మ సంబరాలు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్‌ను సొంతం చేసుకున్నాయి. ఏకంగా రెండు గిన్నిస్ రికార్డులను సాధించి చరిత్ర సృష్టించాయి. హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో మహా బతుకమ్మ కార్యక్రమాన్ని అధికారులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కోసం 10 వేల మందితో బతుకమ్మ వేడుకను అధికారులు చేపట్టారు.

మహా బతుకమ్మ దగ్గర గిన్నిస్ బుక్ రికార్డు సభ్యుల పర్యవేక్షణ చేశారు. ఈ నేపథ్యంలో మహా బతుకమ్మ కార్యక్రమం ఏకంగా రెండు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకుంది. అతిపెద్ద జానపద నృత్యంగా తెలంగాణ బతుకమ్మ ఒక గిన్నిస్ రికార్డు సాధించింది. మరో రికార్డుగా 66.5 అడుగుల భారీ బతుకమ్మ చుట్టూ ఒకేసారి 1,354 మంది మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆడి మరో గిన్నిస్ రికార్డు క్రియేట్ చేశారు. ఈ మేరకు తెలంగాణ బతుకమ్మ వేడుకకు 2 గిన్నిస్ రికార్డులు దక్కాయి. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి బతుకమ్మ వేడుక నమోదైంది. పది వేల మంది మహిళలు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ.. పాటలు పాడుతుండగా గిన్నిస్ బుక్ ప్రతినిధులు వివరాలను నమోదు చేసుకుని ఫలితాన్ని ప్రకటించారు. ఒకేసారి పది వేల మందితో బతుకమ్మ ఆడించి గిన్నిస్ రికార్డుల్లో స్థానం దక్కించుకోవడమే లక్ష్యంగా మహా బతుకమ్మ కార్యక్రమం కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఈ మేరకు అధికారుల అంచనాలను మించి మహా బత్తుకమ్మ రెండు గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకుంది.




# త్వరలో నక్సల్ రహిత భారత్

## చివరి దశలో నక్సలిజం ఉనికి!

## "భారత్ మంథన్"లో బీజేపీ అగ్రనేతల నమ్మకం!!

ఢిల్లీ : నక్సలిజాన్ని వచ్చే ఏడాది మార్చి 31లోపు నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం టార్గెట్ గా పెట్టుకుంది. 'నక్సల్–రహిత భారతదేశం' అనే అంశంపై ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన 'భారత్ మంథన్' కార్యక్రమం జరిగింది.

ఇందులో హోంమంత్రి అమిత్ షాతో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. మావోయిస్టు హింస ప్రభావిత ప్రాంతాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అధిగమించడానికి అవసరమైనవ్యూహాలపై వివరణాత్మక అభిప్రాయాలను పంచుకున్నారు. మావోయిస్టు ఉగ్రవాదంపై విజయం కేవలం భద్రతా దళాల ఫలితం మాత్రమే కాదు, సమాజం సమిష్టి అవగాహన, అభివృద్ధి , ప్రజాస్వామ్య సాధికారత ఫలితమని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. పారామిలిటరీ దళాలు, పోలీసుల భాగస్వామ్యం, కఠినమైన చర్యల కారణంగా, నక్సలిజం ఉనికి చివరి దశలో ఉందన్నారు. భారత్ మంథన్లో ప్రసంగించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మావోయిస్టులతో ఎలాంటి శాంతి ఒప్పందం ఉండబోదని, ఆయుధాలు వదులుకుని లొంగిపోతే వారికి పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేశారు. అమిత్ షా, ఇటీవల చత్తీస్గఢ్లో విడుదలైన ఒక లేఖను ఉద్దేశిస్తూ, మావోయిస్టులు లొంగిపోతామని చెప్పడం గందరగోళం సృష్టించే ప్రయత్నమని విమర్శించారు. "శాంతి ఒప్పందం ఉండదు. ఆయుధాలు వదులుకోండి, లొంగిపోండి, పునరావాసం కల్పిస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి లేకపోవడమే నక్సలిజం పెరగడానికి కారణమనే వాదనను "తప్పుదారి పట్టించే" ప్రచారంగా షా తోసిపుచ్చారు. "స్వాతంత్ర్యం వచ్చినప్పుడు వనరులు పరిమితంగా ఉన్నాయి, అన్ని ప్రాంతాలు ఒకేసారి అభివృద్ధి చెందలేదు.

కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. చత్తీస్గఢ్లోని బీజాపూర్, సుక్మా వంటి ప్రాంతాల్లో అభివృద్ధిని అడ్డుకున్నది ఎవరు?" అని ఆయన ఎడతెగని మావోయిస్ట్ మద్దతుదారులను ప్రశ్నించారు. ఆయన కొలంబియా, పెరూ, కంబోడియా ఉదాహరణలను ప్రస్తావిస్తూ, వామపక్ష భావజాలం మరియు హింస ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయన్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి, నక్సలిజంపై "ఏకీకృత , కఠిన" విధానాన్ని అనుసరించినట్లు షా తెలిపారు.

గత ప్రభుత్వాల "విచ్ఛిన్న" విధానాలకు భిన్నంగా, ఈ వ్యూహం హింసకు వ్యతిరేకంగా కఠిన చర్యలు, లొంగిపోయినవారికి పునరావాసం, మరియు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధిని కలిపి చేసింది. "మేం రక్తపాతం కోరుకోం. కానీ అమాయక ఆదివాసీలను చంపాలనుకుంటే, వారిని రక్షించడం మా ధర్మం" అని ఆయన అన్నారు.

# సంపాదకీయం

## అరవింద్ కేజ్రీవాల్ కు లక్కీ ఛాన్స్....అన్నీ ఒకే..!

రాజకీయాల్లో ఎప్పుడు ఎవరు? ఏమవుతారో తెలియడం చాలా కష్టం. ఢిల్లీ పీఠం అధిరోహించడం కంటే ముందు కేజ్రీవాల్ పై ప్రజలకు విపరీతమైన నమ్మకం ఉండేది. మొదట్లో మంచి పాలన సాగించిన కేజ్రీవాల్ రాను రాను విమర్శలను, ఆరోపణలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ తర్వాత లిక్కర్ స్కాంలో పీకల్లోతు ఇరుకొన్ని సీఎం పదవి పోగొట్టుకోవాల్సి వచ్చింది. జైలు జీవితం కూడా గడపాల్సి వచ్చింది. ఇప్పుడు మళ్లీ ఆయన రాజకీయల్లో చురుకుగా పాల్గొనే అవకాశం వచ్చిందంటూ వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇండీ కూటమి నుంచి ఆయనను ఎగువ సభకు పంపించాలన్న చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

**మళ్లీ చురుకుగా అరవింద కేజ్రీవాల్..** రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ రాజ్యసభకు పోటీ చేసే అవకాశంపై మళ్లీ ఊహాగానాలు తలెత్తుతున్నాయి. పంజాబ్ నుంచి రాజ్యసభకు వెళ్లే అవకాశం ఉండచ్చని, ఇప్పటికే లుథియానా వెస్ట్ ఉప ఎన్నికల్లో గెలిచిన అరోరా స్థానంలో ఆయనే వెళ్లనున్నారని ఆప్, ఇండీ కూటమి నుంచి లీకులు వస్తున్నాయి. రాజ్యసభ ఎన్నికకు అక్టోబర్ 13వ తేదీతో నామినేషన్ల గడువు ముగియనుండగా, అక్టోబర్ 24న ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ నిర్ణయం ఎలా ఉంటుందన్న ఆసక్తి పెరుగుతోంది.

**జాతీయ అంశాలపై వట్టే కలిసి వస్తుందా..?...** కేజ్రీవాల్ ను రాజ్యసభకు పంపిస్తే కేంద్రంలో ఎన్‌డీయే ప్రభుత్వాన్ని జాతీయ అంశాలపై బలంగా ఢీకొట్టగలరని రాజకీయ ప్రముఖుల నుంచి విశ్లేషణలు ఉన్నాయి. అంతేకాదు.. ముందున్న రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై కూడా ఆయన ప్రభావం ఉండే ఛాన్స్ ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

ముఖ్యంగా పంజాబ్‌లో ఆప్ ఆధిపత్యం ఉండడం వల్ల కేజ్రీవాల్‌కు పార్లమెంట్ రాజ్యసభ ద్వారానే జాతీయ వేదికలో మళ్లీ చురుగ్గా నిలబడే అవకాశం లభించనుంది.

**పార్టీ మళ్లీ పుంజుకునే అవకాశం...** అయితే, ఇవి కేవలం ఊహాలేనా..? లేదంటే నిజం ఉందా..? అనేది చూడాలి. ఎందుకంటే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. స్వయంగా కేజ్రీవాల్ సహా అగ్రనేతలు మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్ ఓటమి పాలవ్వడం ఆ పార్టీని చాలా వరకు కుంగదీసింది. కేజ్రీవాల్ తన నియోజకవర్గంలో కేవలం మూడు వేల ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ చేతిలో ఓడిపోవడం ఆయన భవిష్యత్తు రాజకీయాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఆప్ కు బలం పెరుగుతుందా..?...** ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ రాజ్యసభ వైపు అడుగులు వేయడం ద్వారా తన రాజకీయ కేరీర్ ను మళ్లీ బలోపేతం చేసుకోవచ్చని అనుకునే అవకాశం ఉంది. ఒకవేళ అలాంటి నిర్ణయం తీసుకుంటే, అది ఆయనకే కాకుండా ఆప్ పార్టీ భవిష్యత్తుకు కీలకంగా మారుతుందని ప్రముఖులు విశ్లేసిస్తున్నారు. అయితే దీనిపై కేజ్రీవాల్ మాత్రం ఇప్పిటీ మీడియా ముందు ఎలాంటి విషయాలు చెప్పలేదు.



## తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పండగ అయిన సద్దుల బతకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి



శామీర్ పేట, సెప్టెంబర్ 29 (ప్రజా మలుపు) : ఉమ్మడి శామీర్ పేట మండలంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరానంటాయి. సోమవారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని తూంకుంట మున్సిప ల్, అలియాబాద్ మున్సిపల్, మూడు చింతల పల్లి మున్సిపల్ పరిధి లోని పలు గ్రామాలలో సద్దుల బతుకమ్మ సంబరాలను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. గత తొమ్మిది రోజుల నుంచి ఆయా గ్రామాలలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. చివరిరోజు మహిళలు అత్యంత ఉత్సాహంతో, భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. రంగురంగుల పూలతో మహిళలు, యువతులు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా బతుకమ్మలను తయారు చేసుకొని ఇళ్ల ముందు పెట్టి ఆటాడి అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడలిలో పెట్టి బతుకమ్మ పాటలను పాడుతూ లయబద్ధంగా ఆటలు ఆడారు. అనంతరం చెరువులు కుంటల వద్ద పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలాడి చెరువుల్లో నిమజ్జనం చేశారు. అనంతరం పసుపు కుంకుమ వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

## వాడవాడలా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు



శామీర్ పేట, సెప్టెంబరు 29 ( గరుడ వార్త ) : పూర్వ ఉమ్మడి శామీర్పేట మండలంలో శరన్నవరాత్రోత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారం ఉమ్మడి శామీర్ పేట



మండలం లోని తూంకుంట మున్సిపల్, అలియాబాద్ మున్సిపల్, మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని వివిధ గ్రామాలలో శరన్నవరాత్రోత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో, వివిధ గ్రామాల్లో అమ్మవారి మంటపాలు ఏర్పాటు చేసి పూజలను నిర్వహించారు. ఉమ్మడి మండలంలోని పలు గ్రామాలలో యువజన సంఘాలు, ఆర్గనైజర్ల ఆధ్వర్యంలో మండపాలను సిద్ధం చేసి అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేసి వేదబ్రహ్మణుల మంత్రోశ్చరణలతో కన్నుల పండవగా పూజలు చేశారు. అలాగే శ్రీ దుర్గా విఘ్నేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారిని శ్రీ సరస్వతి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. చిన్నారులకు బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే కుంకుమార్చన నిర్వహించారు. శామీర్ పేట కట్ట మైసమ్మ ఆలయంలో అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు చేశారు.



## శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సరస్వతి దేవిగా దర్శనమిచిన అమ్మవారు

శామీర్ పేట (గరుడ వార్త) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా శ్రీ గాయత్రి మహా క్షేత్రంలో శ్రీ సరస్వతి దేవి అమ్మవారు దర్శనమిచ్చారు. శామీర్ పేట మండలం తూంకుంట పరిధి లోని శ్రీ గాయత్రి మహా క్షేత్రం లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ వ్యవస్థాపకులు శిష్య పరివ్రాజక వాక్ బ్రహ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామి ఉపాసకులు డాక్టర్ ఎస్వీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## గుర్రం జాషువా సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం..



హైదరాబాద్:గుర్రం జాషువా హరిచంద్ర నాటకం కాటికాపరి పద్యాలతో గ్రామీణల హృదయాలలో కొలువైయు న్నారని విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బూర్గుల మధుసూదన్ రావు పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, కుసుమ ధర్మన్న కళా పీఠం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీత్యాగరాయగానసభ లో గుర్రం జాషువా జయంతి సందర్భంగా కవిసమ్మేళనం,గుర్రం జాషువా సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కొండూరు హరినారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కొండూరు హరినారాయణ రెడ్డి మాట్లాడుతూ గుర్రం జాషువా గారి సాహిత్యమే ఆయన గొప్ప సాహిత్యకారులు అనడానికి నిదర్శమని తెలిపారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు మాట్లాడుతూ గుర్రం జాషువా సాహిత్యంలో జాతీయాభిమానం, సంఘ సంస్కరణల అభిలాష వీరి రచనల్లో వెల్లివిరుస్తాయని తెలిపారు. ఎనిమిది నాటకాలు, మూడు నవలలు, ఏడు కండ కావ్యాలు రచించారని వివరించారు. సూళ్లూరుపేట నుండి వచ్చిన కళాకారులకు 'నృత్యలక్ష్మి' అవార్డుతో సత్కరించారు. అనంతరం గుర్రం జాషువా సాహిత్య పురస్కార గ్రహీతలు తాళ్లూరి మయూరి, దుబ్బా భాస్కర్, పి.పద్మావతి, మార్గం రాజేష్, నక్క కుమారస్వామి, ఎమ్.శంకర్, షేక్ మస్తాన్ వలి, లయన్ మేడిశెట్టి వెంకటేశ్వర్లు లను శాలువా, జ్ఞాపిక, మెడల్, ప్రశంసాపత్రం, దండ, కిరీటదారణతో ఘనంగా సత్కరించారు.

## ఆకట్టుకునేలా.. అక్షరాస్యత పెంచేలా..

వికారాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య లేకపోవడంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపుతూ, అక్కడే కొనసాగిస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన విద్యాశాఖ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. సర్కారు బడుల్లోనే పూర్వ ప్రాథమిక విద్య అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని, క్షేత్రస్థాయిలో కసరత్తు ముమ్మరం చేసింది. తద్వారా బడుల్లో చిన్నారుల సంఖ్యను పెంచవచ్చని యోచిస్తోంది.

**మూడేళ్ల వయస్సు నుంచే..**

ప్రభుత్వం మూడేళ్ల వయసున్న పిల్లలకు ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తోంది. ఇప్పటికే జిల్లాలో పది పాఠశాలల్లో అమలు చేస్తోంది. చిన్నారులకు చదువుతోపాటు ఆటలు, వారి పోషణపై దృష్టి పెట్టేందుకు ప్రతి పాఠశాలకు ఆయా, బోధకురాలి నియామకానికి దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందుకు కనీస అర్హత ఇంటర్ లేదా సమానమైన అర్హత ఉన్న మహిళలు మాత్రమే అర్హులు. ఆయా పోస్టులకు కనీస అర్హత ఏడో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలి. ఎంపికైన వారికి ఒక విద్యాసంవత్సరంలో 10నెలలకు మాత్రమే గౌరవ వేతనం అందించనున్నారు. జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఎంపికైన బోధకురాలికి తప్పనిసరిగా శిక్షణ ఇవ్వనున్నారు.

**బోధకుల నియామకానికి..**

ఈ విద్యాసంవత్సరం నుంచే పూర్వ ప్రాథమిక పాఠశాలల ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం జిల్లాలో 33 పాఠశాలలను మంజూరు చేసింది. వీటిల్లో వసతుల కల్పన, బోధకుల నియామకం చేపట్టనుంది. ఒక్కో పాఠశాలకు రూ. 1.5లక్షల చొప్పున ఇచ్చి, అవసరమైన సౌకర్యాలను కల్పించనున్నారు. ప్రతి పాఠశాలలో ఫర్నిచర్‌కు రూ. 50వేలు, క్రీడల సామగ్రికి రూ. 50వేల చొప్పున ఖర్చు



చేయాల్సి ఉంటుంది. అదే విధంగా రూ. 50 వేలతో పిల్లలను ఆకట్టుకునే విధంగా గదిని ప్రత్యేకంగా అలంకరించనున్నారు.

**స్థానికులకే ప్రాధాన్యం..**

బోధకురాలు, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు అదే గ్రామానికి చెందిన వారై ఉండాలని, వారి నివాస ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని డీఈఓ చెప్పారు. దరఖాస్తులను సెప్టెంబరు 1 నుంచి 9 వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

మండలాలు - 20
పంచాయతీలు - 594
ప్రాథమిక పాఠశాలలు - 774
ప్రాథమికోన్నత - 116
ఉన్నత పాఠశాలలు - 176
విద్యార్థులు - 90,650

**పర్యవేక్షణ బాధ్యత ప్రధానోపాధ్యాయులదే**

ప్రీప్రైమరీ పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడితో పాటు ఎంఈఓలదే. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి మరింత బలోపేతం చేసేదిశగా ప్రభుత్వం కృషిచేస్తోంది. పూర్వ ప్రాథమిక విద్య పూర్తయ్యాక ప్రభుత్వ బడుల్లోనే చదివేందుకు ఆస్కారముంది. అన్ని చోట్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి

## అమ్మ ఒడే..తొలి బడి..!

నాంపల్లి : చిన్నారులు బడిలో చదువుకుంటున్నా.. తల్లిదండ్రుల ఒడిలో నేర్చుకునే అంశాలే వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకోవడంలో కీలకపాత్ర పోషిస్తాయి. వారు బడుల్లో గురువుల కంటే తల్లిదండ్రుల వద్ద గడిపే సమయమే ఎక్కువ. ఈ నేపథ్యంలో పిల్లలను సమున్నత విలువలతో పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ప్రస్తుతం కొందరు విద్యార్థి దశలోనే నేర ప్రవృత్తి వైపు ఆకర్శితులవుతున్న క్రమంలో తల్లిదండ్రులు మరింత బాధ్యతగా వ్యవహరించాలి.

**పొదుపు పాఠాలు..**

ప్రస్తుతం ఎంత సంపాదించాం. అనే దానికంటే.. ఎంత పొదుపు చేశాం అన్నదే ముఖ్యం. చిన్నతనం నుంచే పిల్లల్లో పొదుపు పాఠాలు అలవర్చాలి. పొదుపు సూత్రాలు పాటిస్తూ క్రమబద్ధమైన విధానాన్ని ఆచరిస్తే భవిష్యత్తులో ఆర్థిక ఒడిదొడుకులు లేకుండా జీవితం సాఫీగా సాగుతుందన్న విషయాన్ని చెప్పాలి.

**ఆదర్శ జీవనం..**

పిల్లలు ఎక్కువగా కన్నవారినే అనుకరిస్తారు. మీ చిన్నారి ఉత్తమ విలువలతో జీవించాలని అనుకుంటే మొదట మీరు వారికి ఆదర్శంగా ఉండాలి. దీంతోపాటు ఆదర్శవంతంగా జీవించిన, సమాజంలో స్ఫూర్తిదాయక పాత్ర పోషించిన ప్రముఖుల జీవిత చరిత్రలను, వారి జీవన గమనంలోని ప్రధాన ఘట్టాలను విడమరచి చెప్పాలి.



**పుస్తక పఠనం వైపు..**

పిల్లల్లో పత్రికలు, పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించాలి. నిత్య జీవితంలో దాన్నో భాగం చేస్తూ నీతి కథలు, ఆదర్శ పురుషుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వాన్ని మెరుగు పరిచే పుస్తకాలను చదివించాలి. గురువులు, పెద్దలను గౌరవించాలని చెప్పాలి. వారు ఎక్కడ కలిసినా నమస్కరించి, మర్యాదపూర్వకంగా పలకరించాలని సూచించాలి.

సమయం కేటాయించాలి: బోయపల్లి రాంశెట్టి, విశ్రాంత ప్రధానాచార్యులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాంపల్లి

తల్లిదండ్రులు రోజులో కొంత సమయాన్ని చిన్నారులకు కేటాయించాలి. మీ ప్రవర్తననే వారు భవిష్యత్తులో అనుకరిస్తారనే విషయం గుర్తించాలి. పరిపూర్ణ వ్యక్తులుగా ఎదిగేలా విలువైన పాఠాలు బోధించాలి. నైతిక విలువలు నేర్పిస్తూ.. ఆదర్శవంతమైన మార్గాన్ని చూపాలి.

# కొలతల కొర్రీలు.. ముట్టజెబితే బిల్లులు!

సూర్యాపేట : కోదాడ నియోజకవర్గంలోని ఓ మండల పరిధిలో లబ్ధిదారుడు చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ కొలతలు నిబంధనల మేరకు లేవంటూ గ్రామస్థాయి అధికారి కొర్రీ పెట్టారు. ఇంతలో రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తి మధ్యవర్తిగా జోక్యం చేసుకుని బిల్లులు రావాలంటే కొంత ఖర్చవుతుందని లబ్ధిదారుడి నుంచి రూ.25 వేలు తీసుకున్నట్లు సమాచారం.

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల మంజూరులో పారదర్శకత పాటిస్తున్న అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయంలో ఒక పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయడంతోపాటు ఒక గ్రామంలోని ఇందిరమ్మ కమిటీ సభ్యుడి సభ్యత్వం రద్దు చేసి కేసు నమోదు చేసింది తెలిసిందే. అయినా కొన్ని ప్రాంతాల్లో వసూళ్ల పర్వం కొనసాగుతోంది. పథకానికి సంబంధించిన కొందరు అధికారులు తమ చేతికి మట్టి అంటకుండా మధ్యవర్తులను ముందుపెడుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి నిర్మాణ కొలతలు నిబంధనల ప్రకారం లేవంటూ సాకులను ముడిపెడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కొందరు లబ్ధిదారులు బిల్లులు ఆలస్యంగా వస్తాయనే ఆందోళనతో డబ్బులు ఇస్తున్నట్లు సమాచారం. దీన్ని బయటికి చెప్పుకోలేక పోతున్నారు. వసూళ్ల గురించి చెబితే ముమ్ముందు తమకు ఇబ్బందులు ఎదురవుతాయనే భావనతో ముందుకురావడం లేదని వినికిడి.

**అవగాహన కల్పిస్తే మేలు**

600 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించాలనేది నిబంధన. ఈ విషయంలో ఇంకా చాలామంది లబ్ధిదారుల్లో సందేహం. పిల్లర్ల ఆధారంగా కొలతలు వేసి బిల్లులు మంజూరు చేస్తున్నప్పటికీ.. స్లాబ్ వేశాక దాని ఏరియా కూడా 600 చ.అ. మధ్యలోనే ఉండాలా.. ఎక్కువగా ఉన్నా పర్వాలేదా.. అనే విషయంలో అయోమయం నెలకొందని, అధికారులు అవగాహన కల్పించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



**తిరిగి ఇచ్చారు?**

వసూళ్లకు పాల్పడుతున్న వారి బండారం బయటపడగానే అధికారులు చర్యలు తీసుకుంటుండంతో హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఓ మండల పరిధిలో వసూళ్లకు పాల్పడుతున్న సంబంధిత అధికారులు భయపడ్డారు. తాపీమేస్త్రీలను ముందుపెట్టి వసూళ్లు చేసిన డబ్బులను తిరిగి లబ్ధిదారులకు ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పుడు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులను జమ చేస్తున్నట్లు సమాచారం.

**ఫిర్యాదు చేయొచ్చు**

ఇళ్ల నిర్మాణంలో ఇబ్బందులు పెట్టినా.. బిల్లుల మంజూరులో డబ్బులు డిమాండ్ చేసినా నేరుగా రాష్ట్రస్థాయి అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు అందుకు సర్కారు 18005995991 టోల్‌ఫ్రీ నెంబరును అందుబాటులోకి తీసుకొచ్చింది. వివరాలను గోప్యంగా ఉంచుతారు.

**ఎవరైనా చర్యలు తప్పవు**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను డబ్బులు డిమాండ్ చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటాం. అందులో ఎవరి ప్రమేయమున్నా చర్యలు తప్పవు. ఉద్యోగుల జోక్యం ఉంటే సస్పెండ్ చేస్తాం.
సిద్ధార్థ, హౌసింగ్ పీడీ, సూర్యాపేట

# 3 రోజులు.. రూ.3. లక్షల జరిమానాలు

కామారెడ్డి: నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై పోలీసులు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కొరడా ఝుళిపిస్తున్నారు. జరిమానాలతో ఉల్లంఘనుల ఆట కట్టిస్తున్నారు. వారితో పాటు ఇప్పుడు రోడ్డు రవాణా అధికారుల (ఆర్టీవో) తనిఖీలు కూడా పెరగనున్నాయి. తాజాగా జిల్లాకు కేటాయించిన ఏడుగురు అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు (ఏఎంవీఐ) దీని కోసం రంగంలోకి దిగారు. మూడు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని 3 రెవెన్యూ డివిజన్లలో సోమవారం నుంచి తనిఖీలు చేస్తున్నారు.

**దొరికితే సీజ్ చేయడమే..**

తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులపై పోలీసులు జరిమానాలు, కేసులు నమోదు చేసేవారు. తక్కువ స్థాయిలో వాహనాలను సీజ్ చేసేవారు. కానీ ఆర్టీవో అధికారులు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు 40 వాహనాలను వివిధ కారణాలతో సీజ్ చేశారు. రూ.3 లక్షలకు పైగా



జరిమానాలు విధించారు. అంటే నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. రాబోయే రోజుల్లో తనిఖీలు మరింత తీవ్రం చేస్తామని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

**ఎంత విధిస్తున్నారంటే..**పోలీసులతో పోల్చితే ఆర్టీవో అధికారుల జరిమానాలు అధికంగా ఉండనున్నాయి. హెల్మెట్ లేకుంటే రూ.1,000, లైసెన్స్ లేకుంటే రూ.2,500 జరిమానా విధిస్తామని చెబుతున్నారు. ఇన్సూరెన్స్ లేకుంటే చిన్న వాహనాల నుంచి రూ.1000, పెద్ద వాహనాలకు రూ.2,000 వసూలు చేస్తారు. సీటు బెల్టు పెట్టుకోకున్నా రూ.1000 చెల్లించాల్సిందే.

**హెల్మెట్ ధరించాల్సిందే**

'వాహనాల తనిఖీలు అధికం చేశాం. సరైన పత్రాలు లేకుంటే రోడ్డుపై తిరగలేరు. ట్రాన్స్‌పోర్టు వాహనదారులు టాక్స్ కట్టాలి. పనిలేని సమయంలో ముందే సమాచారం ఇస్తే ఆయా కాలానికి సంబంధించిన టాక్స్ అడగబోం. హెల్మెట్ లేకుంటే ఊరుకోబోం.'శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి

# పైపైకి గంగ.. తీరనున్న బెంగ



తాండూరు: జిల్లాలో భారీగా కురిసిన వర్షాలతో భూగర్భజల మట్టాలు గణనీయంగా పెరుగుతున్నాయి. గతేడాది ఆగస్టులో ఎక్కువ లోతులో ఉన్న గంగ ఈసారి అదే నెల నాటికి ఏకంగా 4.05 మీటర్లు పైకి వచ్చింది. దీంతో తాగు, సాగునీటికి కష్టాలు తప్పనున్నాయి. ఎగువన కురిసిన భారీ వర్షాలకు దిగువనున్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆ నీరంతా చెరువులు, కుంటలు, జలాశయాల్లోకి వెళ్లడంతో మత్తడి దూకాయి. బంజరు, అటవీ భూములు బాగా తడిశాయి.

యాసంగి సాగుకు అనుకూలం.. పెరిగిన భూగర్భ జలమట్టాలు అక్టోబరు నుంచి ప్రారంభమయ్యే యాసంగి సాగుకు అనుకూలంగా మారాయి. 1.30 లక్షల ఎకరాల్లో వరి, వేరుసెనగ, పండ్లతోటలు, కూరగాయల పంటలు సాగు చేయనున్నారు. ఆయా పంటలకు బోర్లు, బావుల నుంచి తోడే నీరే ఆధారం. ఇందులో వరి సాగుకు నీటి వినియోగం ఎక్కువ. మిగిలిన వాటికి వారం, పది రోజులకోసారి పారించాల్సి ఉంటుంది. బోర్లు, బావుల్లో మట్టం పెరగడంతో సాగుకు ఇబ్బందులు తప్పనున్నాయి.

**కాగ్నా, కాకరవేణి పరివాహకంలో..**


జిల్లాలోని కాగ్నా, కాకరవేణి నదులకు అడ్డంగా పది ఆనకట్టలున్నాయి. ఇప్పటికే అవన్నీ వరద నీటితో నిండాయి. ఫలితంగా పరివాహకంలోని బోర్లు, బావుల్లో నీరు 2- 4 మీటర్లపైకి వచ్చింది. ఒక్కో ఆనకట్ట పరిధిలో అదనంగా 300- 500 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేసే వీలు కలిగింది.

**పొదుపుగా వాడుకోవాలి..**

- రవిశంకర్, జిల్లా భూగర్భజల వనరుల అధికారి, వికారాబాద్

జిల్లాలో భారీగా కురిసిన వర్షాలకు భూగర్భ జలమట్టం గణనీయంగా పెరిగింది. పొదుపుగా వాడుకోవాలి. వృథా నీటిని భూమిలోకి ఇంకించేందుకు ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి. రైతులు పంటల సాగుకు ఎంత అవసరమో అంతే వినియోగించాలి. బోర్లను నిర్విరామంగా నడపరాదు. వ్యక్తిగత అవసరాలకు సరిపోను మాత్రమే వాడుకోవాలి.

# అక్రమాల దారి.. ఆదాయం హారీ



సిరిసిల్ల: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. జిల్లాకు డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్)కు నిధులు సమకూర్చేందుకు 'సాండ్ ట్యాక్స్' విధానానికి రెవెన్యూ శాఖ చేసిన ప్రణాళికలు కార్యరూపం దాల్చకపోవటంతో ఇసుక అక్రమార్కులు యథేచ్ఛగా సహజ సంపద దోచేస్తున్నారు. మండలాల వారీగా తహసీల్దార్ కార్యాలయాల్లో ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు, రూ.10వేలు చెల్లించి 'సాండ్ ట్యాక్స్' పథకంలో చేరాలని మే, జూన్ నెలల్లో అవకాశం ఇచ్చారు. ఎవరూ ముందుకు రాకపోవటంతో పథకం ఉద్దేశం కాగితాలకే పరిమితమైంది. సాండ్ ట్యాక్స్ ఆన్‌లైన్ విధానం అమలు చేస్తే అక్రమాలకు అడ్డుకట్టపడే అవకాశం ఉంది. ఏటా రూ.6.34 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా. ఉన్నతాధికారులతో కూడిన జిల్లా సాండ్ కమిటీ ఉంది. దీని నిర్వహణకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఇద్దరు నోడల్ అధికారులు ఉన్నారు.

**12 చోట్ల రీచ్‌లు**

మానేరు, మూల వాగుల్లో 12 చోట్ల ఇసుక రీచ్‌లను గనుల శాఖ ఇది వరకే గుర్తించింది. 14 లక్షల క్యూబిక్ మీటర్ల పైనే ఇసుక లభిస్తుందని అంచనా వేశారు. ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలకు రెవెన్యూ అధికారులు జారీ చేసే వే బిల్లులతోనే ఇసుక తవ్వి.. తరలించాలనే నిబంధన ఉంది. అయితే మండల రెవెన్యూ కార్యాలయాల్లో వే బిల్లుల జారీ, వాటి నిర్వహణ, ఇసుక తవ్వకాలపై పర్యవేక్షణ లేక ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పక్కదారి పడుతోంది. ప్రస్తుతం వే బిల్లులో ట్రాక్టర్ ఇసుక(మూడు క్యూబిక్ మీటర్లకు) రూ.450 చెల్లిస్తున్నారు.

**అధిక ధరలకు విక్రయం**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శులే వే బిల్లులు జారీ చేస్తున్నారు. వీటితో వారు ఇసుక సరఫరా చేసే మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారు. సాధారణంగా జిల్లాలో దూరాన్ని బట్టి రూ.2500 నుంచి రూ.3000 తీసుకుంటున్నారు. అదే ఇందిరమ్మ వేబిల్లులకు వచ్చేసరికి రూ.4000 నుంచి రూ.5000 వసూలు చేస్తున్నారు. అక్రమార్కులు ఒక్క వేబిల్లుతో నాలుగు, అయిదు ట్రిప్పుల ఇసుక వాగుల్లోంచి తోడుకొచ్చి గ్రామ శివారుల్లో పెద్దఎత్తున నిల్వచేసుకుంటున్నారు. వాగుల్లో వరద ఉధృతి ఎక్కువగా ఉన్న సమయంలో దీన్ని అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పంచాయతీల్లో వేబిల్లు జారీ తర్వాత క్వారీలు, రవాణాల తనిఖీలు ఉండవు. బిల్లుపై ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్న చోటు.. తేదీ, సమయం లాంటివి ఏవీ ఉండవు. ఈనెల 18న వీర్నపల్లిలో తప్పుడు తేదీతో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలో ఈ ఏడాది అక్రమ ఇసుక రవాణా చేస్తున్న 126 వాహనాలు, 156 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి కళ్లు గప్పి తరలిస్తున్నవి అనేకం ఉంటాయి.

# నాడు వెలవెల.. నేడు జలకళ!

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులోని జక్కుల చెరువు ఇది. దీని కింద రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి గ్రామాల్లో 494 ఎకరాల ఆయకట్టు ఉంది. గత జులై వరకు కొత్తగా వరదనీరు వచ్చి చేరకపోవడంతో డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదలతో ఓ వైపు ఎగువమానేరు వాగు ఉధృతంగా పారినప్పటికీ చెరువు వెలవెలబోతూ కనిపించడంతో రెండు గ్రామాల రైతులు ఒక దశలో ఆందోళన చెందారు. కొన్ని బోరుబావులు వట్టిపోయాయి కూడా. ఈ వానాకాలం, రానున్న యాసంగి సీజన్‌లో పంటల సాగుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఇదే చెరువు ఇప్పుడు మత్తడి పారుతోంది. ఆ నీరు ఎల్లారెడ్డిపేటలోని 600 ఎకరాల ఆయకట్టు ఉన్న గిద్దెచెరువులోకి ప్రవహిస్తోంది. మరికొద్దిరోజుల్లో గిద్దెచెరువు కూడా మత్తడిపారే అవకాశాలున్నాయి. ఇలా గొలుసుకట్టు చెరువులు క్రమంగా జీవం పోసుకుంటున్నాయి.మెట్ట ప్రాంతమైన జిల్లాలో సీజన్ ఆరంభంలో వర్షాలు తొలుత ఊరించినా ఆ తర్వాత ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో ఒక్కసారిగా ఊపందుకున్నాయి. దీంతో జిల్లాలో నీరు లేక నాడు వెలవెల బోయిన సాగునీటి వనరులు నేడు జలకళను సంతరించుకొని నిండుకుండలను తలపిస్తున్నాయి. అధిక వర్షాలు కురవడంతోపాటు ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు రావడంతో మధ్యతరహా ప్రాజెక్టులు సహా పలు చెరువులు, కుంటలు మత్తడి పారుతున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో వ్యవసాయానికి ఆయువుపట్టుగా ఉండే గొలుసుకట్టు చెరువులు జీవం పోసుకుంటున్నాయి. మరికొద్ది రోజులపాటు వర్షాలు, వరదలు ఇలాగే కొనసాగితే జిల్లా వ్యాప్తంగా సాగునీటి వనరులన్నీ పూర్తిస్థాయిలో నీటి మట్టాన్ని సంతరించుకొని, కళకళలాడనున్నాయి. ప్రస్తుత వానాకాలం సీజన్‌తోపాటు ముమ్ముందు యాసంగిలోనూ సాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలు పుష్కలంగా పండనున్నాయి.

**12 శాతం అదనపు వర్షపాతం**



జిల్లాలో ఈ నెల 23 నాటికి 688.6 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 771.9 మీటర్లు కురిసింది. 12 శాతం అదనపు వర్షపాతం నమోదైంది.

ఇల్లంతకుంట, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లో అధిక వర్షాలు పడగా రుద్రంగిలో మాత్రం లోటు వర్షాలు కురిశాయి. మిగతా 9 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

సిరిసిల్ల డివిజన్‌లో 265, వేములవాడ డివిజన్‌లో 251 కలుపుకొని మొత్తం 516 చెరువులున్నాయి. వీటిలో ఈ నెల 23 వరకు 88 చెరువులు మత్తడి పారుతున్నాయి.

0-25 శాతం నీటితో 126, 25-50 శాతంతో 119, 50-75 శాతంతో 129 చెరువులుండగా 75- 100 శాతం నీరు వచ్చిన చెరువులు 54 ఉన్నాయి.

మరోవైపు భారీ వర్షాలున్నట్లు వాతావరణశాఖ చెబుతోంది. ఈ అంచనా ప్రకారం 75- 100 శాతం వరకు నీరున్న చెరువులన్నీ పూర్తిస్థాయిలో నిండిపోనున్నాయి. మిగతా చెరువులు కూడా జలకళను సంతరించుకొని జిల్లాలో సాగునీటి బెంగ తీరనుంది.

# ఆగండి.. వివరాలు చూడండి!

కాగజ్‌నగర్ : పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్‌లో అయిదు రోజుల కిందట ఇద్దరు వ్యక్తులు అయిదు మిల్క్‌మిస్ట్ (శీతలపానీయం)లను కొనుగోలు చేశారు. గడువు దాటినప్పటికీ (ఎక్స్‌పైరీ) విక్రయాలు చేపడుతుండటాన్ని గుర్తించిన వారు.. నిర్వాహకులను ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో మున్సిపల్, ఆహార భద్రత అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఈ విషయమై బాసర జోనల్ అధికారి నాయక్‌ను సంప్రదించగా.. వినియోగదారులు మోసపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కాగజ్‌నగర్‌లో జరిగిన మోసంపై ఫిర్యాదు అందిందని, అధికారిని పంపించి చర్యలు చేపడతామని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాకు వారం రోజుల్లో అధికారి నియామకం కానున్నారని తెలిపారు.

బతుకమ్మ, దసరా పండగల సీజన్ ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులో మార్పులు చేసి కొంతమేర భారం తగ్గించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ వ్యాపారాలు జోరందుకున్నాయి. మార్కెట్‌లో వివిధ ఆఫర్లతో ప్రజలను ఊరిస్తున్నాయి. దుస్తులు మొదలుకుని కిరాణాలు, సూపర్ మార్కెట్లలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పట్టణాలకు సైతం సూపర్ మార్కెట్ కల్చర్ విస్తరిస్తోంది. దీనికితోడూ ఆన్‌లైన్ వేదికలు కూడా అందుబాటులో ఉన్నాయి. నిత్యావసర సరకులతోపాటు ఇతర వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. ఇదే సమయంలో వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. పలు కిరాణా షాపులు, సూపర్ మార్కెట్‌లు, తదితర వాటిల్లో నాణ్యత లేని, గడవు తీరినవి అంటగట్టే ప్రమాదం ఉంది. తొందరపడి కొనుగోలు చేస్తే మోసపోయే అవకాశం ఉంది.

**అప్రమత్తత అవసరం**

సూపర్ మార్కెట్‌లలో అన్నీ ఒకేచోట లభిస్తాయి కదా అని వినియోగదారులు ఎక్కువగా వాటిలో కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని నాణ్యత లేని, కాలం చెల్లినవి కొనుగోలు చేసే ఆస్కారం ఉంది. తొందరలో ఆయా వస్తువుల కాలపరిమితి, నాణ్యతను జాగ్రత్తగా పరిశీలించాలి. ముఖ్యంగా తినే పదార్థాల ప్యాకింగ్ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రతి ప్యాకెట్‌పై తయారు చేసిన తేదీ, ఎప్పటి వరకు వరకు వాడొచ్చు, ధర, చిరునామా తదితర విషయాలు ఉంటాయి. వీటిని సరి చూసుకోవాలి. ఏదైనా తేడాగా ఉంటే కొనొద్దు. ఒకవేళ మోసపోయామని గుర్తిస్తే వినియోగదారుల ఫోరంకు నిర్ణీత రుసుము చెల్లించి దరఖాస్తు చేసి న్యాయం పొందవచ్చు.

**ఆహార భద్రత అధికారుల జాడేది?**

నిత్యం తనిఖీలు చేసి వినియోగదారులకు నాణ్యమైన, కల్తీ లేని సరకులు అందేలా చర్యలు చేపట్టాల్సిన ఆహార భద్రత అధికారుల జాడ ఉమ్మడి జిల్లాలో కరవైంది మంచిర్యాల మినహా నిర్మల్, కుమురంభీం జిల్లాలకు కలిపి ఒక్కరే అధికారి విధులు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్‌లో ఒక్కరూ లేరు. వినియోగదారులు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. పలుచోట్ల మొక్కుబడి చర్యలతో మమ అనిపిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

# స్థానిక పోరుకు సర్వం సిద్ధం

కామారెడ్డి : స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. తాజాగా రిజర్వేషన్లను ఖరారు చేసిన అధికారులు ప్రభుత్వ ఆదేశాలతో ఆ వివరాలను బయటకు వెల్లడించలేదు. పల్లె ఓటర్ల జాబితా, నోడల్ అధికారుల నియామకాలను ఇది వరకే పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రి ముద్రణ, కరదీపికల పంపిణీ కూడా పూర్తయింది. రోజున స్టేజ్-1, స్టేజ్-2 అధికారులకు కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గ కేంద్రాల్లో సర్పంచి, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఒక రోజు శిక్షణ కూడా ఇచ్చారు.

**ప్రకటనే వస్తే ముందుకు..**

స్థానిక పోరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి సానుకూలత వస్తే ఎన్నికల కమిషన్ ప్రకటన జారీ చేస్తుంది. రిజర్వేషన్ల ప్రక్రియ కూడా పూర్తవడంతో అందరూ సర్కారు నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. దసరా లోపు లేదా ఆ తర్వాత స్థానిక ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందనే చర్చ సాగుతోంది. తాజాగా స్టేజ్-1, 2 అధికారులకు కూడా శిక్షణ పూర్తి చేశారు. పోలింగ్ తేదీలకు ముందు వీరికి మరోమారు శిక్షణ ఇస్తారు. వాస్తవానికి జనవరి నెలలోనే ఎన్నికల ప్రకటన వస్తుందని అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరిలో ఎన్నికల అధికారులకు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ప్రస్తుతం మళ్లీ ఇచ్చారు. ఇలా పనులు చకచకా చేసుకుంటూ అధికారులు ముందుకు వెళ్తుండడంతో.. ఎన్నికల ప్రకటన త్వరలో వస్తుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని ఆయా రాజకీయపార్టీలు పేర్కొంటున్నాయి. గ్రామాల్లో పాత రిజర్వేషన్ల ప్రకారం కొత్త రిజర్వేషన్ల చర్చ నడుస్తోంది. ఆశావహులు గ్రామాల్లో మద్దతు కూడగట్టుకుంటున్నారు.

**వసతులపై దృష్టి**

జిల్లాలో 6,39,730 మంది ఓటర్లు ఉండగా.. 532 పంచాయతీలు, 4,656 వార్డుల్లో, 233 ఎంపీటీసీ, 25 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. 4,670 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఆయా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఎన్నికలు పూర్తిగా బ్యాలెట్ విధానంలో జరుగుతాయి. కావాల్సిన బ్యాలెట్ పెట్టెలను కూడా ఇప్పటికే తెప్పించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు సరఫరా, తాగు నీరు, ప్రహరీ, ఫ్యాన్లు, ర్యాంపులు వంటి సౌకర్యాలు ఉందీ లేనిది లెక్క తీస్తున్నారు. చివరిసారి నిర్వహించిన ఎన్నికల్లో మూడు విడతల్లో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఇప్పుడు రెండు విడతల్లో నిర్వహించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

# గుత్తే'దారులు' కావలెను!

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ గ్రామీణ మండలం భీంసరి వాగు వద్ద వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. మూడు సార్లు టెండర్లు పిలిచినా లాభంలేదు.జిల్లాలో రహదారుల నిర్మాణానికి గుత్తేదారులు ఆసక్తి కనబర్చడం లేదు.. ప్రధానమైన పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, ఐటీడీఏ ఇంజినీరింగ్ శాఖల పరిధిలో మంజూరైన పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో రూ.కోట్ల పనులు పూర్తి కావడం లేదు. నిబంధనల సడలింపుపై చర్చ జరుగుతోంది.రూ.2 కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన పనులను స్పెషల్ క్లాస్-1 గుత్తేదారు చేపడతారు. స్థానికంగా బ్యాచ్‌మిక్స్(డాంబర్, కాంక్రీట్ మిశ్రమం కలిపే) ప్లాంటు కలిగి ఉండాలి. జిల్లాలో అర్హులైన గుత్తేదారు ఒక్కరే ఉన్నారు. రూ.కోట్లలో బిల్లులు పేరుకుపోవడంతో సదరు బడా గుత్తేదారు ఏడాది కిందట గుండెపోటుతో మృతిచెందారు. పాత బిల్లులు రాకపోవడంతో ఆ నిర్మాణ సంస్థ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. దీంతో వంతెనలు, రహదారులకు నిధులు మంజూరైనా మోక్షం లభించడం లేదు. బ్యాచ్‌మిక్స్ ప్లాంటు కలిగి ఉండడం, ఇతర కొన్ని నిబంధనలు సడలిస్తే ఇతర జిల్లాల గుత్తేదారులు వచ్చేందుకు వీలుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రూ.2 కోట్ల కంటే తక్కువ పనులు చేపట్టాలంటే హార్డ్ డ్రం మిక్స్ ప్లాంట్(బీటీ తరహాలోనే చిన్న ప్లాంటు) సొంతంగా కలిగి ఉండాలి. ఈ తరహా అర్హులైన గుత్తేదారులు నలుగురున్నా వారికీ బకాయిలు పేరుకుపోవడంతో పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. మూడు శాఖల్లో టెండర్లు దక్కించుకొని 52 పనులకు సంబంధించి రూ.171 కోట్లకుపైగానే పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంద్రవెల్లి మండలం ఈశ్వర్‌నగర్ నుంచి ఉట్నూర్‌నర్సాపూర్(బి) వరకు అధ్వానంగా మారిన రహదారి నిర్మాణానికి రూ.3.86 కోట్లు మంజూరయ్యాయి. మూడు సార్లు టెండర్లు పిలిచినా స్పందన లేదు.

# అనుమతి లేకుంటే సై'ఖతం'

దమ్మపేట : ఏపీలోని కొవ్వూరు ఇసుక రేవు నుంచి తెలంగాణలోకి అక్రమంగా ప్రవేశించిన రెండు ఇసుక టిప్పర్లను సత్తుపల్లి పోలీసులు నాగుపల్లి-బుగ్గపాడు నడుమ ఈనెల 23న పట్టుకున్నారు. టిప్పర్లు పట్టుబడిన ప్రాంతం దమ్మపేట మండలం పరిధిలోకి వస్తుండటంతో వాహనాలను దమ్మపేట పోలీసులకు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి దమ్మపేట మండలానికి ఇసుక టిప్పర్లు ప్రవేశించే జలవాగు, వడ్లగూడెం సరిహద్దులో కొంతమంది అటవీశాఖ సిబ్బంది అర్ధరాత్రి పూట పహారా కాస్తున్నారు. టిప్పర్లను అడ్డుకుని అటవీప్రాంతం నుంచి ఇసుక తీసుకొస్తున్నారని, కేసులు బనాయిస్తామంటూ బెదిరించి రూ.వేలు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు దమ్మపేటకు చెందిన కొంతమంది విలేకరుల (ఈనాడు, ఈటీవీ కాదు) ముసుగులో ఏపీలోని ఇసుక ర్యాంపుల నిర్వాహకులతో కుమ్మక్కై దందా సాగిస్తున్నారు. ఇదొక ఆదాయ వనరుగా మారటంతో తమ వద్దే ఇసుక కొనాలని సామాన్యులను బెదిరించి పోలీసు కేసుల్లో ఇరుక్కుంటున్నారు.

**ఏపీ ఇసుకపై చోటా నాయకుల కన్ను**

ఏపీ ఇసుక దందాపై కొంతమంది చోటా నాయకుల కన్ను పడింది. ఇసుక మాఫియాను గుప్పిట్లోకి తీసుకున్నారు. తమ అనుమతి లేకుండా దమ్మపేట మండలానికి వస్తున్న ఇసుక టిప్పర్ల సమాచారాన్ని



పోలీసులకు చేరవేస్తున్నారు. కేసులు పెట్టిస్తున్నారు. ఏపీలోని ఇసుక ఇక్కడి అధికారులు, నాయకులు, మరికొంతమందికి కాసులు కురిపిస్తోంది. దమ్మపేట, అశ్వారావుపేట, సత్తుపల్లి మండలాల్లో ఇప్పుడు ఇసుక దందానే నయా ట్రెండ్‌గా మారింది. రాజమహేంద్రవరంలో 30 టన్నుల ఇసుక లారీ లోడింగ్, రవాణా ఛార్జీలతో కలిపి మొత్తంగా ఇక్కడికి చేరుకునే సరికి రూ.20వేల నుంచి రూ.25 వేలు ఖర్చవుతుంది. ఇక్కడ టన్ను రూ.1,500కు అమ్ముతున్నారు. సుమారు లారీ ఇసుకను రూ.40వేల నుంచి రూ.45వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దమ్మపేట మండలంలో ఇసుక అక్రమాలపై దృష్టి సారిస్తాం. ఏపీ నుంచి ఇసుక తీసుకొచ్చి ఇక్కడ దందా చేస్తున్నవారి వివరాలు సేకరిస్తున్నాం. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. సామాన్యులు ఇసుక కోసం దళారులను ఆశ్రయించవద్దు. భగవాన్‌రెడ్డి, తహసీల్దారు, దమ్మపేట

# అత్యవసర సేవ.. కమీషన్ల తోవ

నల్గొండ: అర్ధరాత్రి పాముకాటు వేస్తేనో.. క్షణికావేశానికిలోనై పురుగుమందు తాగిన కేసులుంటేనో..రోడ్డు ప్రమాదాలు.. తీవ్రమైన కడుపునొప్పితో బాధపడే రోగులు ప్రభుత్వ ఆసుపత్రిలోని అత్యవసర వైద్యవిభాగానికి హడావుడిగా వస్తుంటారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రిటికల్ కేర్, వైద్యులను ప్రభుత్వం ఏర్పాటు చేసినా..ఇలాంటి కేసులను వైద్యులు 'చూసీచూడనట్లు' వదిలేసి వెంటనే హైదరాబాద్, జిల్లాలోని ప్రముఖ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికో తీసుకెళ్లాలని చేతులెత్తేస్తున్నారు. వెంటనే బాధితుల బంధువుల ఆందోళనలు, అవసరాన్ని చూసి అక్కడున్న ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు రంగప్రవేశం చేస్తారు. మీరు వాహనంలో ఎక్కండి.. నాకు తెలిసిన మంచి ఆసుపత్రి ఉందంటూ 'కమీషన్' ఇచ్చే వైద్యుడి వద్దకు తీసుకెళ్తారు. ఇలా రోజూ రెండు మూడు కేసులను తమకు తెలిసిన ఆసుపత్రులకు తీసుకెళ్లడం.. రోగుల నుంచి ముక్కుపిండి వసూలు చేయడం పరిపాటిగా మారాయి.

నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాసుపత్రులకు ఎదురుగానే ఒక్కో ఆస్పత్రి వద్ద గరిష్ఠంగా 15 వరకు ప్రైవేట్ అంబులెన్స్‌లు తిష్ఠవేస్తున్నాయి. ఆపదతో వచ్చే రోగుల అత్యవసరాలను ఆసరా చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రులు ఇచ్చే కమీషన్ల కక్కుర్తితో ఇలా నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు.

మూడు జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రెండేసి చొప్పున ప్రభుత్వ అంబులెన్స్‌లు ఉన్నా.. ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ డ్రైవర్లను ఏర్పాటు చేసుకుంది. వారికి నెలకు సరిపడా వేతనాలు, డీజిల్‌కు డబ్బులు ఇవ్వడం లేదు. పైగా ఈరెండు వాహనాలు పాతవి కావడంతో తరచూ



మరమ్మతులకు గురవుతున్నాయి.

కొన్నిచోట్ల ప్రభుత్వ అంబులెన్స్ డ్రైవర్లను భయభ్రాంతులకు గురిచేసో, మభ్యపెట్టో తమ వాహనంలోకి రోగులను ఎక్కించుకుని తమకు కమీషన్ ఇచ్చే ఆసుపత్రికి తీసుకెళ్లి అప్పటికప్పుడే డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాసుపత్రుల ఎదుట నిలిపి ఉంచే ఈ ప్రైవేట్ అంబులెన్స్‌లు నెలకు ఎలాంటి కిరాయిలు చెల్లించడం లేదు. ఎవరైనా ఆటోలు, ఇతర వాహనాల్లో వస్తే వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నల్గొండ జిల్లాసుపత్రిలో రెండు అంబులెన్సులుండగా ఒకటి తరచూ మరమ్మతులకు గురవుతుందని.. మరొకదాన్ని రిఫరల్ సర్వీసులకు ఉపయోగిస్తున్నామని జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకురాలు డా.అరుణ కుమారితో తెలిపారు. తెల్లరేషన్‌కార్డు వారికి ఉచితమని.. మిగతా వారు డబ్బులు చెల్లించాలని పేర్కొన్నారు. గతంలో ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చామని.. ఆర్థిక దోపిడీ చేయవద్దని సూచించామన్నారు. ఎవరైనా వీరి ఆగడాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బ్యాక్ బిల్లింగ్ పేరుతో బాదుడు




హైదరాబాద్ : గచ్చిబౌలిలోని తులసి ఎన్‌క్లేవ్ 5 అంతస్తుల భవనం. ఏడు విద్యుత్తు కనెక్షన్లున్నాయి. ఒక అంతస్తును డెలివరీ సంస్థకు, మూడు అంతస్తులు పీజీ హాస్టల్‌కు.. ఇలా భిన్న అవసరాల కోసం యజమాని అద్దెకు ఇచ్చారు. ఒకేస్థలంలో ఒకేరకమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని 5 కనెక్షన్లు కలిపి ఒకటే బిల్లు ఇవ్వడమే కాదు.. వాడకంలో అవకతవకలు ఉన్నాయంటూ.. నిబంధనలకు విరుద్ధంగా బ్యాక్ బిల్లింగ్ పేరుతో రూ.6.81 లక్షలు టీజీఎస్పీడీసీఎల్ డీపీఈ విభాగం బిల్లు వేసింది.

మీటర్ పాడైందని అధికారులకు ఫిర్యాదు చేస్తే బ్యాక్ బిల్లింగ్ పేరుతో వినియోగదారులపై అడ్డగోలుగా భారం మోపుతున్నారు.

నగరంలో విద్యుత్తు పంపిణీ సంస్థ ఆదాయం పెంచుకునేందుకు వ్యాపారకేంద్రాలనుతనిఖీ చేస్తోంది. ఒకే ప్రాంగణంలో ఒకే రకం కార్యకలాపాలు కొనసాగుతూ.. విద్యుత్తు కనెక్షన్లు వేర్వేరుగా ఉన్నవాటిపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో పీజీ హాస్టల్స్ ఉన్న భవనాలను డీపీఈ విభాగం తనిఖీ చేస్తోంది. విద్యుత్తు చౌర్యం, మీటర్ ట్యాంపరింగ్, గృహ కనెక్షన్ తీసుకుని వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకోవడం వంటి కేసుల్లో ఈ విభాగం తనిఖీలు చేపట్టి మొదటిసారైతే జరిమానాలు వేస్తుంది. హాస్టల్స్ ఎక్కువ ఉన్న దిల్‌సుఖ్‌నగర్, సుల్తాన్‌బజార్, బేగంపేట, అమీర్‌పేట, ఎస్‌ఆర్‌నగర్, గచ్చిబౌలి, కాజాగూడ, కేపీహెచ్‌బీ, మీర్‌పేట, గండిమైసమ్మతోపాటు ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీ కార్యాలయాలున్న ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఇక్కడ ఒక్కో భవనంలో వేర్వేరు అంతస్తుల్లో హాస్టల్స్ ఉంటున్నాయి. ఒక్కో ఫ్లోర్‌కి ఒక్కో విద్యుత్తు కనెక్షన్ ఉంటోంది.

**కలిపి బిల్లింగ్..** ఒకే ప్రాంగణంలో మూడు నాలుగు అంతస్తుల్లో హాస్టల్స్ ఉంటే.. వాటన్నింటిని కలిపి ఒకటే కనెక్షన్ కింద డిస్కం బిల్లింగ్ చేస్తోంది. సిటీలో ఈ తరహాలో కనెక్షన్లు వేలల్లో ఉన్నాయి. దీంతో డిస్కం ఆదాయం పెరిగింది. ఇక్కడి వరకు డిస్కంకు అధికారం ఉంది. కానీ లేని అధికారాలను వినియోగదారులపై ప్రయోగిస్తోంది.

**ఇలా చేయడం చట్టవిరుద్ధం...**

ఒకవేళ డీపీఈ తనిఖీల్లో ఇలాంటి కేసులను గుర్తిస్తే.. వాటన్నింటికి బ్యాక్ బిల్లింగ్ వేయవచ్చా? గత నెలలో డీపీఈ అధికారులు ఈ విధంగా గచ్చిబౌలి కేసులో రూ.6.81 లక్షలు బ్యాక్ బిల్లింగ్ వేశారు. దీంతో యజమాని సీజీఎఫ్ఆర్‌ను ఆశ్రయించగా.. ఏ నిబంధన ప్రకారం బ్యాక్‌బిల్లింగ్ వేశారో చెప్పాలని ఫోరం అడిగింది. జీటీసీఎస్ క్లాజ్ 3.5.3 కానీ, టారిఫ్ ఆర్డర్‌లో ఎక్కడా బ్యాక్‌బిల్లింగ్ గురించే లేదు. అలా చేయడం చట్టవిరుద్ధం అంటూ ఫోరం తీర్పు ఇచ్చింది.

# ఊడ్చేస్తారు.. ఇల్లు జాగ్రత్త



చొప్పదండి: బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ఊరెళున్నారా.. అయితే జాగ్రత్త ఉండాలని సూచిస్తున్నారు జిల్లా పోలీసులు. ఉపాధి, ఉద్యోగాలు, పిల్లల చదువులకు పట్టణాలకు వచ్చిన వారంతా.. గ్రామీణ ప్రాంతాలకు వలస వెళ్లడం సహజం. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోతుండటంతో ఇటీవల దోపిడీలు, చోరీలు పెరిగాయి. ఈ నేపథ్యంలో అలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూసేందుకు కరీంనగర్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

**పాటించాల్సినవి**

ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నట్లయితే ముందస్తుగా పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వడం.ఇంట్లో లేకున్నా విద్యుత్తు దీపాలు వేసి ఉంచాలి. ఎవరైనా ఉన్నట్లు అర్థమవుతుంది. దీంతోపాటు తాళం వేసిన ద్వారాలకు పరదాలు వేయాలి.బంగారు ఆభరణాలు, నగదు వెంట తీసుకెళ్లాలి. లేదా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి.రాత్రిపూట ఒంటరిగా వెళ్లాల్సి వస్తే మహిళలు తక్కువ ఆభరణాలు ధరించడం శ్రేయస్కరంఊరెళ్లే ముందు ద్విచక్ర వాహనాలు ఆరుబయట, ప్రహారీ లోపల, ఇంటి ముందు పెట్టి వెళ్లొద్దు ఇంట్లో ఒక్కరే ఉన్నప్పుడు ఆభరణాలకు రంగులు, మెరుగు పెడతామంటూ వచ్చే వారిపై జాగ్రత్తగా ఉండాలి. అనుమానంగా అనిపిస్తే సాధ్యమైనంత వరకు వారి ప్రాంతం, గుర్తింపు కార్డులు పరిశీలించాలి. కొత్త వ్యక్తులను నమ్మకూడదు.ఇల్లు, గదులకు అద్దె కోసం వచ్చినవారికి మహిళలు ఇంట్లో ఒంటరిగా ఉంటే గదులు లేవని చెప్పడమే మంచిది.

అనుమానాస్పద వ్యక్తులు కాలనీల్లో సంచరిస్తుంటే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలి ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం వాడాలి. కాలనీలు, బహుళ అంతస్తుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళ కనిపించేలా కెమెరాలుంటే మంచిది.

**100 నంబరుకు సమాచారం ఇవ్వాలి**

పోలీసుశాఖ వారి జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉంటే చోరీల భయముండదు. పండగల నేపథ్యంలో నిరంతరం గస్తీ చర్యలు చేపడుతున్నాం. బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది రాత్రి నుంచి తెల్లవారుజామున వరకు గస్తీ నిర్వహించేలా చూస్తున్నాం. ఏదైనా అత్యవసరమైతే ప్రజలు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారమివ్వాలి లేదా డయల్ 100ను సంప్రదించాలి.

– ప్రదీప్‌కుమార్, సీఐ చొప్పదండి

# అనుమతులు రాక నీరంతా వృథా

సారంగాపూర్: బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు నీరందించాలన్న లక్ష్యంతో బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టును ఆధునికీకరించాలని నిర్ణయించారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతుండటంతో అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికీ అటవీ శాఖ అనుమతులు కొలిక్కి రాకపోవడంతో గతంలో ఉన్న 0.25 టీఎంసీ సామర్థ్యం మేర నీటిని నిలువ చేసేందుకు అధికారులు తాత్కాలికంగా షట్టర్ల బిగింపునకు చర్యలు చేపట్టారు. అయితే పూర్తి స్థాయిలో నిలువ చేసుకొనే అవకాశం లేక ప్రస్తుత వర్షాలకు నీరంతా వృథాగా పోతోంది.

**రూ.92 కోట్ల చెల్లింపులు**

ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.153 కోట్లు కాగా ఇందులో నిర్మాణ వ్యయం రూ.109 కోట్లు. ఇప్పటివరకు ప్రాజెక్టు నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తి కాగా గుత్తేదారుకు రూ.92 కోట్లు చెల్లించారు. మరో రూ.12 కోట్లు చెల్లించాల్సి ఉంది. మరో రూ.5 కోట్ల మేర పనులు చేయాల్సి ఉంది. అటవీ అనుమతులు వచ్చి పనులు పూర్తి చేస్తే టీఎంసీ నీటిని నిలువ చేసుకునే వీలుంది. ప్రజాప్రతినిధులు చొరవ చూపితే యాసంగిలో చివరి ఆయకట్టుకు నీరందే అవకాశముంది.

**తాత్కాలిక షట్టర్ల బిగింపు**

ప్రాజెక్టు ఆధునికీకరణలో భాగంగా దాదాపు 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. షట్టర్ల బిగింపు మిగిలి ఉండటంతో వాటి ఏర్పాటు కోసం ఇటీవల ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు చేసింది. అటవీ అనుమతులు రాగానే తూములకు షట్టర్లు బిగించే అవకాశముంది. ప్రస్తుతం వృథా నీటికి అడ్డుకట్ట వేసేందుకు తాత్కాలికంగా తయారు చేసిన షట్టర్లను తూముల వద్ద అడ్డుగా వేశారు. పూర్తి స్థాయిలో నిలువరించలేకపోయినా కొంతమేర అడ్డుకునే అవకాశముంది.

పాత ప్రాజెక్టు నిలువ సామర్థ్యం 0.25 టీఎంసీ కాగా ఆ మేర నీటి



నిలువ కోసం ప్రధాన కాలువతో పాటు బుగ్గ చెరువు వైపు ఉన్న తూములకు తాత్కాలిక షట్టర్లు ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం డీ-53, 12 ఎల్ కాలువ ద్వారా వస్తున్న ఎస్సారెస్పీ నీటితో పాటు గుట్టల నుంచి వచ్చే వరదతో ప్రాజెక్టులో 9 అడుగుల వరకు నీటి మట్టం చేరుకుంది. 12 అడుగుల వరకు చేరుకొనే అవకాశముంది.

తాత్కాలిక షట్టర్లు ఏర్పాటు చేసి ప్రస్తుతం నీటిని నిలువ చేసుకుంటున్నా ఆయకట్టుకు నీరు అవసరమున్న సమయంలో వాటిని పైకి ఎత్తడం, దింపడం ఇబ్బందిగా మారుతోంది.

**సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు**

గతంలో ఉన్న సామర్థ్యం మేరకు నీరు నిలువ ఉండేలా తాత్కాలిక షట్టర్లను బిగించాం. బీర్‌పూర్, ధర్మపురి మండలాల ఆయకట్టుకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుత వర్షాలకు పనులు నిలిచిపోయాయి. వాటిని వెంటనే పూర్తి చేస్తాం.– చక్రునాయక్, నీటిపారుదలశాఖ ఈఈ

# ఏటీసీ.. భలే క్రేజీ..

పాల్వంచ: యువతలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరిచి ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లను ప్రారంభించింది. 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఐటీఐ విద్యను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో నాలుగు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లోని ఏటీసీ కోర్సుల్లో సీట్లన్నీ భర్తీ అయ్యాయి. ఖమ్మం ఐటీఐ కళాశాలలో ఏటీసీ భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అదేరోజు భద్రాద్రి జిల్లాలోని మూడు కళాశాలలు ఆఫ్‌లైన్‌లో ప్రారంభమవు తాయని అధికారులు తెలిపారు.

**ఆరు కోర్సుల్లో సీట్లన్నీ భర్తీ**

విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను ఏటీసీ నేర్పిస్తుంది. ఇందులో ఆరు కోర్సులు ఉంటాయి. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ కోర్సులో 40 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్-40, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్-24, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్-24, ఎలక్ట్రిక్ వెహికల్ మెకానిక్-24, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ కోర్సులో 20 చొప్పున సీట్లను ప్రభుత్వం కేటాయించింది. ఖమ్మం, కొత్తగూడెం, మణుగూరు, కృష్ణాసాగర్(బూర్గంపాడు)లోని నాలుగు కళాశాలల్లో 688 సీట్లు భర్తీ అయ్యాయి. ఏటీసీ కోర్సుల్లో చేరేందుకు పలువురు విద్యార్థులు.. మంత్రులు,




ఎమ్మెల్యేలు, ఇతర అధికారుల నుంచి సిఫార్సు లేఖలు తీసుకొస్తుండటం గమనార్హం. ఒక్కో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రూ.4.70 కోట్లతో నూతన భవన సముదాయాలను ప్రభుత్వం నిర్మించింది. అవసరమైన ప్రయోగశాలలు, ఇతర పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'రాష్ట్రవ్యాప్తంగా 65 ఐటీఐ కళాశాలల్లో ఏటీసీ కోర్సులను సర్కారు ప్రవేశపెట్టింది. పది ఏటీసీల భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఏటీసీ కోర్సులు అభ్యసించిన విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుంది' అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐటీఐ విద్య కన్వీనర్ గోనెల రమేష్‌కు తెలిపారు.

# ఆఫర్ల కాలం.. ఎంపికే కీలకం

హుజూర్‌నగర్: దసరా, దీపావళి పండగల ఆఫర్లంటూ మైకులు, ప్రసార, సామాజిక మాధ్యమాల్లో ఊదరగొట్టేస్తున్నారు. చీరలను కిలోల చొప్పున అమ్ముతున్నారు. ఇవి కాకుండా ఒకటి కొంటే మరొకటి ఉచితమని, ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా గతంలో లేని విధంగా ఆఫర్లలో వస్తున్నాయి. ముఖ్యంగా యువత చరవాణుల కోసం ఎగబడుతున్న పరిస్థితి. ఈ సమయంలో ఆకర్షణీయ ప్రకటనలతో కాకుండా కొంచెం ఆలోచించి నిర్ణయం తీసుకుంటే లాభమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.వినియోగదారులను ఆకర్షించేందుకు వ్యాపారులు పెద్ద ఎత్తున ఆఫర్లు ఇస్తుంటారు. ఈ సందర్భాలను ఉపయోగించుకుని ఉన్న స్టాకును ఖాళీ చేసుకునేందుకు చూస్తుంటారు. ఎక్కువ వ్యాపారం చేసుకోవాలని, లాభం ఉంటుంది కాబట్టి ఈ ఆఫర్లు ఇస్తుంటారు. ఎక్కువ కొంటే ఎక్కువ తగ్గింపులు వస్తాయని చాలామంది కొనేస్తుంటారు.ఆఫర్ల కొనుగోళ్లు ఎక్కువ శాతం అనవసరమైనవేనని ఇటీవల ఒక సర్వే సంస్థ చెప్పింది. కానీ అదే సంస్థ వీటిని ఉపయోగించుకుంటున్న వారిని అభినందించింది. కొన్ని సందర్భాల్లో అవసరం లేకపోయినా కొన్ని వస్తువులు మనింటికి చేరుతాయి. ఆఫర్లు ఉన్నాయని కాకుండా మనకు ఎంతవరకు అవసరమో గుర్తించి కొనుగోలు చేయడం ఉత్తమమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. నిజంగా కొన్నిసార్లు తక్కువ ధరకే వస్తుండవచ్చు అలాంటి సమయంలో ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఈఎంఐలతో కొంటుంటారు. కానీ అది వినియోగదారునికి ఆర్థిక భారమే అని మరిచిపోవద్దు.

ఎలక్ట్రానిక్ వస్తువులు కొంటుంటాను

పండగ ఆఫర్ల సమయంలో ఎక్కువగా ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేస్తుంటాను. ఇంట్లోకి, పిల్లలకు కావాల్సినవి చూసి అవసరమైతేనే కొనుగోలు చేస్తాను.గోపీచంద్, హుజూర్‌నగర్

**జాగ్రత్తలు అవసరం**ఆఫర్ల పేరుతో వచ్చే అవకాశాలను పరిశీలించి ఎంపిక చేసుకోవాలి. ప్రత్యేక సందర్భాల్లో వ్యాపారులు ఎక్కువ అమ్మకాల ద్వారా అధిక లాభాలు పొందేందుకు ప్రయత్నిస్తుంటారు. మరికొందరు వ్యాపారులు నిల్వ ఉన్న సరకులను అమ్ముకునేందుకు ప్రయత్నిస్తుంటారు. కొన్నివేళల్లో.. ఉన్న ధరను పెంచి డిస్కౌంటు ఇచ్చి అమ్మకాలు జరుపుతారు. కొనుగోలుదారులు జాగ్రత్తలు తీసుకోవాలి. అందె సత్యం, ఆర్థిక నిపుణుడు

# 'జల'భద్రం..!

నాగార్జునసాగర్ :ఇటీవల హైదరాబాద్ చింతల్‌కు చెందిన రాంబాబు కుటుంబ సభ్యులతో సాగర్ సందర్శనకు వచ్చి శివాలయం పుష్కరఘాట్ వద్ద నదిలోకి దిగడంతో నీటి ఉద్ధృతిలో గల్లంతయ్యాడు. నాగార్జునసాగర్ ప్రపంచ పర్యాటక కేంద్రం కావడంతో నిత్యం దేశ, విదేశాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇలా వచ్చే వారికి ఇక్కడి పరిస్థితులపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. పర్యాటకులు ఇక్కడికి వచ్చిన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే జీవితాలు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. సాగర్‌లోని పలు ప్రాంతాల్లో ఇటీవల నీట మునిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. పర్యాటకులు ఈ నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

**ప్రమాదకర ప్రదేశాలు..**

పుష్కర ఘాట్: దయ్యాల గండి ప్రాంతంలో ఏర్పాటు చేసిన పుష్కరఘాట్ వద్ద పర్యాటకులు దిగి స్నానాలు చేయడం, నీటిలో ఆటలు ఆడుతుంటారు ఇది ప్రమాదం. ఈ ఘాట్ సమీపంలో పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో అందులో పడి మునిగే అవకాశం ఉంది.

శివాలయం ఘాట్: ఇక్కడున్న పుష్కరఘాట్ వద్ద నీటి ఉద్ధృతి చాలా అధికంగా ఉంటుంది. ఇక్కడ ఎవరు కూడా నీటిలోకి దిగేందుకు సాహసం చేయరాదు.

**జాగ్రత్తలు ఇవే...**

పర్యాటకులు ఈత వచ్చినా సరే కొత్త ప్రాంతాల్లో ఎవరూ కూడా నీటిలోకి దిగకూడదు. ఈత వచ్చినా సేఫ్టీ జాకెట్ వంటివి వాడడం ఉత్తమం.

అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలి.

కొత్త వంతెన వద్ద రక్షణ గోడపై నుంచి వంగి కిందకు చూడకూడదు. నదిలోకి పడే అవకాశం ఉంటుంది.

అధికారుల సూచనలు పాటించాలి...

సాగర్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఎక్కడ కూడా నిర్లక్ష్యంగా ఉండకూడదు. కొత్త వంతెన, దయ్యాలగండి ప్రాంతాల్లో నీటిలోకి దిగే ప్రయత్నాలు చేయవద్దు పర్యాటకులు అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను చూసి ఆ సూచనలు పాటించాలి.శ్రీనునాయక్, సాగర్ సీఐ

# ఈసారి ముందస్తుగా సన్నద్ధత

నేలకొండపల్లి : విద్యార్థుల భవితకు తొలిమెట్టు పదో తరగతి. ఇందులో మంచి మార్కులు సాధిస్తే ఎన్నో అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా సెప్టెంబరు 1 నుంచే ముందస్తు ప్రణాళిక రూపొందించారు. ఏటా జనవరి నెలలో ప్రత్యేక తరగతులు ప్రారంభించటంతో పది ఫలితాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులు వెనకబడుతున్నారు. ఈ విషయం గమనించిన రాష్ట్ర పాఠశాల విద్య కార్యదర్శి యోగితారాణా ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు సెప్టెంబరు నెల నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో సోమవారం నుంచి ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి.

**ఉదయం, సాయంత్రం నిర్వహణ**

రోజువారీగా ఉదయం 8 గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం 4:15 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తారు. ఏ రోజు ఏ సబ్జెక్టు చదవించాలో షెడ్యూల్ విడుదల చేశారు. వారంలో సోమవారం ఉదయం సాంఘికశాస్త్రం, సాయంత్రం తెలుగు, మంగళవారం ఉదయం తెలుగు, సాయంత్రం హిందీ, బుధవారం ఉదయం బయాలజీ, సాయంత్రం ఇంగ్లిష్, గురువారం ఉదయం ఇంగ్లిష్, సాయంత్రం గణితం, శుక్రవారం ఉదయం మ్యాథ్స్, సాయంత్రం ఫిజికల్ సైన్స్, శనివారం ఉదయం ఫిజికల్ సైన్స్, సాయంత్రం సోషల్ స్టడీస్ చదివించాలి. సందేహాల నివృత్తికి ఆయా సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండాలి.

**వచ్చే నెల 10లోపు..**



పదో తరగతి సిలబస్ అక్టోబరులో 10వ తేదీలోపు పూర్తి చేయాలి. ఈ క్రమంలో తరగతుల నిర్వహణపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యే ముందు రివిజన్ తరగతులు, ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాలి. ప్రత్యేక తరగతులకు వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలి. ప్రత్యేక తరగతులను తరగతి గదిలో మాత్రమే నిర్వహించాలి. గ్రీన్‌బోర్డులతో పాటు డిజిటల్ బోర్డులను ఉపయోగించాలి. బృంద చర్చలు చేసుకొనే వెసులుబాటు కల్పించాలి.

ఉన్నత పాఠశాలలు
ఖమ్మం: 227
భద్రాద్రి: 124
విద్యార్థులు
ఖమ్మం: 1,231
భద్రాద్రి: 9,702

జిల్లాల వారీగా పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఎంఈఓలతో పాటు ఆయా ప్రధానోపాధ్యాయులకు సమాచారాన్ని అందించాం. వంద శాతం ఫలితాల కోసం పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా శ్రమిస్తాం. అల్పాహారం విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. బి.నాగలక్ష్మి, డీఈఓ, భద్రాద్రి

# కరకట్టతోనే తప్పేను వరద తిప్పలు

ధర్మపురి: ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు ధర్మపురి పట్టణవాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తుంటారు. లోతట్టు ప్రాంతాల కాలనీవాసులు భారీ వర్షాలుపడితేచాలు ముల్లేమూట సర్దుకొని బతుకు జీవుడా అంటూ పునరావాస కేంద్రాలు, బంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. భారీ వర్షాల సమయంలో ధర్మపురి పట్టణంలోకి వరద నీరు వస్తుండటమే ఇందుకు కారణం. సమస్య నివారణకు కరకట్ట నిర్మించాని ఏళ్లుగా చర్చ జరుగుతుంది. ఇప్పటివరకు ఎలాంటి నిధులు కేటాయించడం లేదు.

**ఒడ్డులకు కోతతో..**

గోదావరి నది దమ్మన్నపేట నుంచి ధర్మపురి తీరానికి ప్రవేశించే సమయంలో దక్షిణాభిముఖంగా ప్రవహిస్తుంది. ఇక్కడ దశాబ్దాల కిందట సహజసిద్ధంగా ఒండ్రు మట్టితో గుట్టలగా ఉండేది. ఇదంతా వరదలకు కొట్టుకుపోయింది. ధర్మపురి వద్ద నదిలో గండ శిలలు(బండరాళ్లు) ఎత్తుగా నీటికి అడ్డుగా ఉండేవి. ఇసుక కూడా విపరీతంగా ఉండేది. ఎంత వరద వచ్చినా పట్టణంలోకి ప్రవేశించకుండే ఇవి ఆపేవి. బండరాళ్లు కొల్లకొట్టడం, ఇసుక అక్రమ రవాణాతో ధర్మపురి పట్టణంలోకి వేగంగా వరద వస్తోంది. పట్టణానికి ఈశాన్యభాగంలో



మఠం రేగడి భూముల గడ్డ కూడా మాయం కావడంతో వరదకు అడ్డులేకుండా పోయింది.

**ముప్పు ఎక్కడంటే..**

కుమ్మరి, బ్రాహ్మణసంఘం వాడ, శ్రీరామాలయం, శ్రీదత్తాత్రేయస్వామి ఆలయం, మంగళిగడ్డ, బోయెవాడ, ఒడ్డెరకాలనీలు గోదావరి వరద ముప్పు ప్రాంతాలు. నదిలో నీటిమట్టం పెరిగిందంటే ఈ కాలనీల వీధులు జలమయంగా మారుతాయి. 2022లో భారీ ఎత్తున వరదలు రావడంతో వారం రోజుల పాటు పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. 1995లో నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు గండి పడటంతో గోదావరిలోకి పది లక్షల క్యూసెక్కులు రావడంతో పై ప్రదేశాలను వరదలు ముంచెత్తాయి. బాధితుల కట్టుబట్టతోనే మిగిలారు. అపారనష్టం వాటిల్లింది.

**మోక్షం ఎప్పుడు?**ధర్మపురి గోదావరి తీరంలో సుమారు 2 కి.మీల మేర కరకట్ట నిర్మించాల్సి ఉంది. 2022లో అప్పటి ప్రభుత్వానికి పురపాలక సంఘం రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపించింది. ఎన్నికలు రావడంతో అక్కడితోనే ఆగిపోయారు. దమ్మన్నపేట చివరి ప్రాంతం నుంచి ధర్మపురి మహాలక్ష్మీ పుష్కరఘాట్ వరకు కరకట్ట నిర్మించినట్లయితే నీరు పట్టణంలోకి రాకుండా రక్షణ గోడలాగా ఉంటుంది. రూ.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

# విద్యార్థులకు చదువు.. ప్రజలకు సేవలు




తాండూరు : కొడంగల్ వైద్య కళాశాలకు 50 వైద్య సీట్లు కేటాయిస్తూ జాతీయ వైద్య కమిషన్ నిర్ణయించింది. తాజాగా జరుగుతున్న కౌన్సెలింగ్‌లోనే విద్యార్థులు ఇక్కడికి రానున్నారు. ఆల్ ఇండియా, రాష్ట్ర కోటాలో మొత్తం సీట్లు భర్తీ చేయనున్నారు. వైద్య కళాశాలను తాండూరు జిల్లా ఆస్పత్రిలో కొనసాగించేందుకు ఇప్పటికే డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆధీనంలోకి తీసుకుంది. అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే ప్రొఫెసర్లు విధుల్లో చేరగా, బోధన నిపుణులు త్వరలో రానున్నారు.అత్యవసర చికిత్స ఇక్కడే: అత్యవసర, ప్రత్యేక చికిత్సలు అవసరమైతే జిల్లా ప్రజలు హైదరాబాద్‌కు పరుగులు తీసేవారు. మెరుగైన వైద్యం అందాలంటే ప్రైవేటుకో లేక ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు పంపించేవారు. ఇక నుంచి ఈ కష్టాలు దూరం కానున్నాయి. తాండూరు జిల్లా ఆస్పత్రిలోనే అత్యవసర, వివిధ రకాల ప్రత్యేక సేవలు అందనున్నాయి. ఇందుకోసం దవాఖానాకు అవసరమైన పరికరాలు, లిఫ్టింగ్ మంచాలు, రోగ నిర్ధారణ, చికిత్సలకు అత్యాధునిక పరికరాలు, సౌకర్యాలను సమకూర్చారు. ఆచార్యులు, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అందించే శస్త్రచికిత్సలు తాండూరులోనే అందనున్నాయి. చిన్నారులు, ఫిజియోథెరపీ, కళ్లు, చెవి, ముక్కు, గొంతు, కిడ్నీ, ఎముకలు, మహిళా సంబంధమైన చికిత్సలు, మానసిక, మెదడు, నరాలు, వివిధ రకాల ప్రత్యేక శస్త్రచికిత్సలు, అవసరమైన రక్త పరీక్షలు, అన్ని రకాల చికిత్సలు జరగనున్నాయని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయని వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజు కు వివరించారు.

**రూ.27 కోట్లతో..**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో రూ.27 కోట్ల వ్యయంతో వైద్య కళాశాల కొత్త భవన నిర్మాణం కొనసాగుతోంది. అప్పటివరకు కళాశాలను తాండూరు జిల్లా ఆస్పత్రిలో నిర్వహించనున్నారు.

ఇక్కడ ప్రతి రోజు 800పైగా రోగులు వైద్యం చేయించుకుంటున్నారు. కళాశాల నిర్వహణ నేపథ్యంలో వైద్య విద్యార్థులకు బోధనతోపాటు, ప్రజలకు వైద్య సేవలు అందనున్నాయి. జిల్లా నలుమూలల నుంచి వికారాబాద్, కొడంగల్, పరిగి నియోజకవర్గాల ప్రజలతో పాటు సరిహద్దు కర్ణాటకకు చెందిన రోగులు సైతం తాండూరు ఆస్పత్రికి వస్తారు. ఇక నుంచి రోజువారీగా వచ్చేవారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. వైద్య విద్యార్థుల వసతికి తాండూరు మైనార్టీ విద్యాలయ భవనాన్ని తాత్కాలికంగా సమకూర్చారు.

# శిథిలావస్థలో ఉన్నా.. తిష్ఠవేశారు!



హుజూరాబాద్ : హుజూరాబాద్ పట్టణ సమీపంలోని ప్రభుత్వానికి చెందిన కేసీక్యాంపు భవనాల్లో పలువురు అక్రమంగా నివాసం ఉంటున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం క్వార్టర్లను నిర్మించగా.. అప్పట్లో నీటిపారుదలశాఖకు చెందిన వందలాది ఎస్సారెస్పీ ఉద్యోగులకు కేటాయించారు. తదనంతరం నీటిపారుదల శాఖలోని పలు విభాగాలను హుజూరాబాద్ నుంచి తరలించటంతో ఇక్కడ కొందరే ఉద్యోగులు మిగిలారు. కేసీక్యాంపు క్వార్టర్లలో చాలా వరకు శిథిలావస్థకు చేరటంతో మెరుగ్గా ఉన్న వాటిని వారికి కేటాయించారు. అయితే ఉద్యోగకాలం ముగిసిన క్వార్టర్ల నుంచి ప్రస్తుతం వారు కదలటం లేదు. రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. కొందరు ఉద్యోగుల సంబంధీకులు కూడా తిష్టవేశారు. సంబంధిత అధికారులు వారి పేరిట చెల్లింపులు చేస్తున్నారు. వారందరిని ఖాళీ చేసి.. ఈ భవనాలను పూర్తిస్థాయిలో తొలగించటానికి అధికారులు వారికి పలుమార్లు కోర్టు నోటీసులు అందజేసిన లాభం లేదు.

**ప్రమాదకరమని తెలిసినా..**

దాదాపు 30 విశ్రాంత ఉద్యోగుల, ఉద్యోగుల సంబంధీకుల కుటుంబాలు క్వార్టర్లలో నివాసం ఉంటున్నాయి. ఆ భవనాలు పెచ్చులూడి కూలిపోయే స్థితికి చేరిన వారు బయటకి రావటం లేదు. శిథిలావస్థకు చేరి, పగుళ్ల బారిన పడి, పిచ్చిమొక్కలతో దుర్భరంగా దర్శనమిస్తున్నాయి. ఖాళీ చేయకుండా కొందరు ఉన్నతాధికారులతో ఈఈ, డీఈ స్థాయి అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ భవనాల్లో దర్జాగా ఉంటున్నా అధికారులు నోరు మెదపకపోవటం గమనార్హం. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు చొరవచూపాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై సంబంధిత డీఈ రాయబారపు ప్రసాద్‌ను వివరణ కోరగా.. క్వార్టర్లలో నివాసముండే వారిని బయటకు పంపించేందుకు.. నీటిసరఫరా, విద్యుత్తు సేవలను నిలిపి వేశామని.. అయినా వారు కదలడం లేదన్నారు. నోటీసులు ఇచ్చినా స్పందించకపోవటం బాధాకరమని, ఉన్నతస్థాయి అధికారుల చొరవ అవసరమని చెప్పారు.

# పంచాయతీలపై కేంద్రం పర్యవేక్షణ



గోదావరిఖని: గ్రామ పంచాయతీల బలోపేతానికి కేంద్రం దృష్టి సారించింది. ప్రస్తుతం పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. పంచాయతీల నిర్వహణ, అభివృద్ధితో పాటు సిబ్బంది వేతనాల చెల్లింపు అంశాల్లో నిధుల కొరత వెంటాడుతోంది. పంచాయతీలను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం 'సమర్థ్ వెబ్ పోర్టల్'ను ప్రారంభించింది. దీని ద్వారా పంచాయతీల పాలనతో పాటు అభివృద్ధికి సంబంధించిన అంశాలను కేంద్రం పర్యవేక్షించనుంది. గ్రామ పంచాయతీలకు పన్నులు, పన్నేతర ఆదాయం ద్వారా సాధారణ నిధి సమకూరుతోంది. జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ప్రస్తుతం పర్యవేక్షణ లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వ నిధులకు సంబంధించి ఈ పోర్టల్‌ను వినియోగించుకొని బలోపేతం చేయనుంది.

**నిధులు మళ్లించకుండా నిఘా**

కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు విడుదల చేసే నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పనులకు మళ్లిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకే పోర్టల్‌ను ప్రారంభించినట్లు తెలుస్తోంది. కేంద్రం కేటాయిస్తున్న నిధులు నేరుగా గ్రామపంచాయతీలకు చేరే విధంగా పర్యవేక్షించనుంది. ఇతర రాష్ట్రాల్లో ఇదివరకే ఈ పోర్టల్‌ను ఏర్పాటు చేసి సమర్థంగా పంచాయతీల పనితీరును మెరుగుపర్చింది. అదే విధంగా ఈ పోర్టల్‌ను తాజాగా ఏర్పాటు చేసి నిధుల వెచ్చింపుతో పాటు ఆర్థిక పరిపుష్టికి తీసుకోవాల్సిన నిర్ణయాలు, సలహాలను అందించనుంది.

**సలహాలు.. సూచనలు** గ్రామ పంచాయతీలను ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సలహాలు సూచనలు అందించనుంది. డిజిటల్ వేదిక ద్వారా నేరుగా పంచాయతీలను పర్యవేక్షించడంతో పాటు మరింత బలోపేతం చేసేందుకు పంచాయతీరాజ్ నిపుణులతో అధ్యయన కమిటీని నియమించింది. సొంత ఆదాయ వనరులు పెరుగుదలకు ఆచరణీయమైన నమూనాను రూపొందించనుంది. ఉమ్మడి జిల్లాలో 1214 గ్రామ పంచాయతీలున్నాయి. రానున్న కాలంలో ఇవి మరింత బలోపేతమయ్యే అవకాశం ఉంది.

# ముందు'చూపు' ఎంతో మేలు

నిజామాబాద్ : అన్ని అవయవాల్లో నేత్రాలు ఎంతో ముఖ్యమైనవని.. చూపును కాపాడుకోవాలని ఇన్‌ఛార్జి ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు ఎం.సాయారెడ్డి విద్యార్థులకు సూచించారు. చిన్నప్పట్నుంచే తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. లయన్స్ క్లబ్ నిజామాబాద్ సెంట్రల్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ నేత్ర వైద్యశాల వైద్యులు డా.సుప్రజ, డా.భుజంగరెడ్డి, లక్ష్మీనర్సయ్య 160 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు. కంటిచూపును కాపాడుకోవాలంటే ఫోన్లకు దూరంగా ఉండాలని వారు సూచించారు. 36 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించిన నిర్వాహకులు.. త్వరలో ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో అస్మా జరీన్, సుజాత, ప్రమీత పాల్గొన్నారు.



# ములాఖత్‌లు.. ముడుపుల లెక్కలు

నిజామాబాద్ : నిజామాబాద్ నగరపాలక సంస్థను అవినీతి చీడ వదలడం లేదు. లంచావతారుల్లో ఎవరో ఒకరు అవినీతి నిరోధక శాఖకు పట్టుబడుతూనే ఉన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, టౌన్ ప్లానింగ్‌లో రోజుల పాటు దస్త్రాలు ముందుకు కదలడం లేదన్న ఆరోపణలున్నాయి. నగరపాలకంలో పలు విభాగాల్లో పనుల కోసం ప్రజలు చెప్పులరిగేలా తిరుగుతున్నారు. అయినా ఫైళ్లు ముందుకు కదలవు. చివరకు లాభం లేదనుకుని దళారులను లేదా కొందరు ప్రైవేటు లైసెన్స్‌డ్ ఇంజినీర్లను బాధితులు ఆశ్రయిస్తున్నారు. వారు అడిగినంత ముట్టజెబితే మాత్రం పనులు పూర్తవుతున్నాయి. ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయాల్లో సాయంత్రం విధులు పూర్తవగానే ఉద్యోగులు ఇళ్లకు బయల్దేరి వెళుంటారు. కానీ, నగరపాలకంలో కొందరు అవినీతి ఉద్యోగుల దినచర్య ఇందుకు విభిన్నంగా ఉంటోంది. పొద్దువాలాకే వారి అసలు పని మొదలవుతుందని సమాచారం. దళారులతో ములాఖత్ కావటం, ఆ రోజుకు సంబంధించిన ముడుపుల లెక్కలు సరిచూకోవడం పరిపాటి అయ్యిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికీ గండిపడుతోంది. లంచం తీసుకుంటూ ఆర్.ఐ. శ్రీనివాసాచారి పట్టుబడటం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.



**ఇప్పటివరకు ఆరుగురు..**

గతంలో కమిషనర్‌గా పనిచేసిన నజీం హైమద్, అకౌంటెంట్ ఓ కాంట్రాక్టర్ వద్ద డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. మరో ఘటనలో లంచం తీసుకుంటూ బిల్ కలెక్టర్‌గా నరేందర్ చిక్కాడు. ఎంబీ (మెజర్‌మెంట్ బుక్) రికార్డు చేసే విషయమై ఆమ్యామ్యాలు పుచ్చుకుంటూ మున్సిపల్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు దొరికాడు. గత సంవత్సరం ఆగస్టులో ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి ఇంట్లో సోదాలు జరపగా.. రూ.6 కోట్ల నగదు, పలు అక్రమాస్తులు బయటపడ్డాయి. తాజా ఘటనలో రెవెన్యూ విభాగంలో ఆర్ఐ రూ.7 వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు.

**ఉద్యోగం నుంచి తొలగిస్తున్నా మారరే**

గతంలో అనిశాకు చిక్కిన ఇద్దరు ఉద్యోగులను ఉద్యోగాల్లోంచి శాశ్వతంగా తొలగించారు. మరో ఉద్యోగి ఏసీబీకి చిక్కిన వెంటనే భవనంపై నుంచి దూకాడు. ఈ ఘటనలో అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఇంత జరుగుతున్నా కొందరు అవినీతి అధికారుల్లో మార్పు రావటం లేదు. ప్రస్తుతం అనిశాకు చిక్కిన రెవెన్యూ ఉద్యోగి గతంలోనూ ఇదే పనికి పాల్పడ్డాడు. అయినా తీరు మారలేదు. ఉద్యోగంలో తిరిగి చేరిన తర్వాతా లంచావతారం ఎత్తాడు. ఈ నేపథ్యంలో అన్ని విభాగాలను ప్రక్షాళన చేయాలని, అవినీతికి తావులేకుండా పర్యవేక్షణ, నిఘా పెంచాలని నగరవాసులు కోరుతున్నారు.

'నగరపాలక సంస్థలో ఏ విభాగంలో డబ్బులు అడిగినా వెంటనే నా దృష్టికి తీసుకురండి. దీర్ఘకాలం తిష్ట వేసి అక్రమాలకు పాల్పడకుండా రెగ్యులర్, ఒప్పంద సిబ్బందిని సెక్షన్లు మార్చుతున్నాం. ఇంకా ఎలాంటి దిద్దుబాటు చర్యలు చేపట్టాలో ఆలోచించి ఆచరణలో పెడతాం.'
దిలీప్‌కుమార్, నగరపాలక కమిషనర్

# రవాణాకు కష్టం.. ఆర్టీసీకి నష్టం

కామారెడ్డి : అసలే ఆదాయ వనరులు లేక చతికిలపడుతున్న ఆర్టీసీకి ఊహించని విధంగా వచ్చిన వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. కామారెడ్డిలో వరదల కారణంగా ఆగస్టు 27 నుంచి 31వ తేదీ వరకు ఆర్టీసీ దాదాపు రూ.90 లక్షల ఆదాయం కోల్పోయింది. ఆగస్టు 27వ తేదీన తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో కామారెడ్డిలో పెద్దచెరువు కాల్వ పొంగి ఉద్ధృతంగా పారింది. తద్వారా జీఆర్ కాలనీ వద్ద పాత జాతీయరహదారి కోతకు గురైంది. హైదరాబాద్ వైపు వెళ్లే రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇది తీవ్ర ప్రభావం చూపింది.

**ప్రయాణానికి ఆటంకం**

నిజామాబాద్ వైపు వెళ్లే క్రమంలో అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వరద నీరు జాతీయరహదారి పైకి రావడంతో కోత పడింది. దీంతో రోడ్డు ఓ వైపు ధ్వంసమైంది. ఆర్టీసీ బస్సుల ప్రయాణానికి ఆటంకం కలిగింది. భిక్కనూరు మండలంలో ఎడ్లకట్ట వాగు పొంగి జాతీయరహదారిని ముంచెత్తడంతో అక్కడ కూడా ఇబ్బందులు తలెత్తాయి. నిజామాబాద్, హైదరాబాద్ మార్గాల్లో ఆగస్టు 30న మరమ్మతుల అనంతరం



రాకపోకలకు పునరుద్ధరించారు. బీబీపేట మార్గంలో వరద కారణంగా రోడ్డు ధ్వంసం కావడంతో రాకపోకలు నిలిచాయి. మరో వైపు కరీంనగర్ మార్గంలో మూడు రోజుల పాటు ప్రయాణం సాగలేదు. పాల్వంచ వాగు ఉద్ధృతంగా పారడంతో ఇరువైపులా రాకపోకలు నిలిచాయి. రోడ్ల మరమ్మతులు వేగవంతమైతేనే రాకపోకలు పునరుద్ధరిస్తామని ఆర్టీసీ డీఎం కరుణశ్రీ న్యూస్‌టుడేకి వెల్లడించారు. వరదల కారణంగా ఆర్టీసీ ఆదాయం కోల్పోవడం బాధాకరమన్నారు.

**ఏయే మార్గాల్లో ఇబ్బందులంటే...**

కామారెడ్డి- నిజాంసాగర్ మార్గంలో బస్సులు నడవడం లేదు. జిల్లాకేంద్రం నుంచి కృష్ణాజివాడి, తాడ్వాయి, ఎర్రాపహాడ్ మీదుగా లింగంపేట వరకు మాత్రమే బస్సుల రాకపోకలు సాగుతున్నాయి. లింగంపేట నుంచి ఎల్లారెడ్డి వెళ్లే మార్గంలో రోడ్డు ధ్వంసం కావడంతో ప్రయాణానికి అనువుగా లేదు.

కామారెడ్డి నుంచి గుండారం, రామారెడ్డి మండలం గిద్దకు బస్సుల రాకపోకలు నిలిపివేశారు. రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు వెల్లడించారు.




## ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం.. ఎంపీ మిథున్ రెడ్డికి బెయిల్


విజయవాడ: ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. లిక్కర్ కేసులో ఎంపీ మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ.. ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రూ.2లక్షలతో రెండు ష్యూరిటీలు ఇవ్వాలని ఆదేశించింది. వారంలో రెండుసార్లు సంతకాలు పెట్టాలని సూచించింది. కాగా, ప్రస్తుతం లిక్కర్ కేసులో ఏ-4 నిందితుడిగా ఎంపీ మిథున్ రెడ్డి ఉన్నారు. ప్రస్తుతం రాజమండ్రి జైల్లో ఉన్న మిథున్ రెడ్డి రేపు(మంగళవారం) జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## షర్మిల మత ప్రచారం చేశారు.. పీవీఎన్ మాధవ్ కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ: ఏపీ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి హిందూ మనోభావాలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడారని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. టీటీడీ నిధులతో సుమారు 5 వేల దేవాలయాలు నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేశారని గుర్తు చేశారు. దేవాలయాల నిర్మాణాలు ఆర్ఎస్ఎస్ ఎజెండా అని షర్మిల వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. దేవాలయాలపై పరిజ్ఞానం లేకుండా, అవివేకంగా షర్మిల మాట్లాడారని విమర్శించారు. ఆమెకు దేవాలయాల వ్యవస్థపై ఎటువంటి అవగాహన, ఆలోచన లేదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఇవాళ(సోమవారం) మీడియాతో మాట్లాడారు. వైఎస్ షర్మిల జీవితంలో ఎప్పుడైనా దేవాలయాలను సందర్శించారా అని మాధవ్ ప్రశ్నించారు. మత ప్రచారాలు స్వయంగా భర్తతో కలిసి చేశారని ఆరోపించారు. మత మార్పిడి చేయాలని పెద్ద ప్రయత్నం చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. టీటీడీపై షర్మిల చేసిన వ్యాఖ్యలపై సోనియాగాంధీ, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దివంగత మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి గతంలో ఏడుకొండలు మూడు కొండలుగా మార్చాలని జీవో ఇచ్చారని గుర్తు చేశారు. తిరుమల తిరుపతి నిధులు ఎలాంటి దుర్వినియోగం అవ్వడం లేదని స్పష్టం చేశారు. నిధులను ఆలయాల నిర్మాణాలు, ధార్మిక సంస్థల నిర్మాణం, ధూపదీప నైవేద్యం కోసం ఉపయోగించుకుంటున్నారని మాధవ్ వెల్లడించారు.

## మహిళా సంక్షేమమే.. కూటమి ప్రభుత్వ ధ్యేయం: మంత్రి నిమ్మల



పాలకొల్లు: మహిళా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం, దేశం బాగుంటాయని పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మెగా వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తోందన్నారు. మహిళలకు వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలకు వీలుంటుందని చెప్పారు. మహిళా సంక్షేమం కోసం ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని పేర్కొన్నారు.

## విజయవాడ ఎయిర్‌పోర్టులో ఉడాన్ యాత్రీ కేఫ్.. ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్



విజయవాడ: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉడాన్ యాత్రీ కేఫ్‌ను పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సోమవారం ప్రారంభించారు. ఎయిర్‌పోర్టుల్లో ఆహారం, బేవరేజ్‌లు కేవలం రూ.10 నుంచి అందుబాటులో ఉండటం ద్వారా ప్రతి ప్రయాణికుడికి అదనపు సౌకర్యాన్ని చేరువ చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో కేంద్రమంత్రి మాట్లాడి వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు.

అనంతరం 'అమ్మ పేరుతో ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా విమానాశ్రయం ఆవరణలో రామ్మోహన్‌నాయుడు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎయిర్‌పోర్ట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద సినిమా పైరసీ ముఠాను తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. ముఠాకు చెందిన ఆరుగురిని అరెస్టు చేశారు. తెలుగు సహా పలు భాషల సినిమాలను పైరసీ చేసినట్లు గుర్తించారు. సినిమా ఇండస్ట్రీకి భారీగా నష్టం చేసినట్లు అంచనా వేస్తున్నారు. 'హ్యాష్‌ట్యాగ్ సింగిల్' సినిమా పైరసీపై గతంలో పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ చేపట్టి జులై 3న వనస్థలిపురానికి చెందిన కిరణ్‌ను అరెస్టు చేశారు. అతడిని కస్టడీలోకి తీసుకుని విచారించారు. పైరసీ ముఠా దుబాయ్, నెదర్లాండ్, మయన్మార్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈటీవీ విన్ కంటెంట్‌ను పైరసీ చేసి అమ్ముకున్న మరో నిందితుడిని అరెస్టు చేశారు. రికార్డు చేసిన కంటెంట్‌ను ఇతర వెబ్‌సైట్లకు పైరసీ ముఠా విక్రయిస్తోంది. ఓటీటీ కంటెంట్లను ఐబొమ్మ సహా పలు ప్లాట్‌ఫామ్‌లకు అమ్ముతోంది.

థియేటర్లలో ప్లే అయ్యే శాటిలైట్ కంటెంట్ ఐడీ, పాస్‌వర్డ్‌లను నేరగాళ్లు క్రాక్ చేస్తున్నారు. ఏజెంట్లకు రికార్డు కెమెరాలు అందజేసి రహస్యంగా రికార్డు చేయడాన్ని నేర్పిస్తున్నారు. అనంతరం వారికి టికెట్లు బుక్ చేసి థియేటర్లలోనూ రికార్డు చేయిస్తున్నారు. చొక్కా జేబు, పాప్‌కార్న్ డబ్బా, కోక్ టిన్‌లలో కెమెరాలు పెట్టి చిత్రీకరిస్తున్నారు. ఏజెంట్లకు క్రిప్టో కరెన్సీ రూపంలో నిందితులు కమీషన్లు ఇస్తున్నారు.

## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద.. 10 గేట్లు ఎత్తి నీటి విడుదల




శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం మరింత పెరిగింది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద మరింత పెరుగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి ఈ సీజన్‌లో తొలిసారి 6 లక్షల క్యూసెక్కులకుపైగా వరద చేరుతోంది.

ప్రస్తుతం 6,10,484 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 10 స్పిల్ వే గేట్లను 23 అడుగుల మేర ఎత్తి 5,90,772 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 5,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 29,097 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 883.10 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 205.22 టీఎంసీలుగా కొనసాగుతోంది.




విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూలా నక్షత్రం రోజు కావడంతో సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనమిస్తున్నారు.

అమ్మవారి దర్శనానికి సోమవారం భారీగా భక్తులు తరలివచ్చారు. అదేవిధంగా సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మరోవైపు భక్తులతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. వినాయక గుడి నుంచి సుమారు 2 కి.మీ మేర భక్తులు బారులుదీరారు.




అమరావతి: ఏపీ మంత్రి నారా లోకేశ్ కు ఆసియా కప్ ఫైనల్ హీరో, భారత క్రికెటర్ తిలక్ వర్మ ప్రత్యేక బహుమతి ఇవ్వనున్నారు. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తాను ఉపయోగించిన క్యాప్‌ను లోకేశ్‌కు ప్రేమతో ఇస్తున్నట్లు తిలక్‌వర్మ పేర్కొన్నారు. ఈ మేరకు తిలక్ వర్మ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తిలక్ వర్మ బహుమతికి మంత్రి లోకేశ్ ముగ్ధుడయ్యారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "తమ్ముడు తిలక్ వర్మ బహుమతి నాకెంతో ప్రత్యేకమైంది. స్వదేశానికి వచ్చాక అతడి చేతుల మీదుగానే క్యాప్ తీసుకుంటా"అని పేర్కొన్నారు. క్యాప్‌పై తిలక్ వర్మ సంతకం చేస్తున్న వీడియోను ఈ సందర్భంగా లోకేశ్ షేర్ చేశారు. ఆసియా కప్ ఫైనల్‌లో తిలక్ వర్మ 69 పరుగులతో నాటౌట్‌గా నిలిచి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.




## ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద ప్రవాహం.. కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

విజయవాడ: ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బ్యారేజీలోకి 6.86 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో 69 గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తి 6.86 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చడంతో బెరంపార్క్ రూమ్స్ వైపు నీరు చేరుతోంది. మరోవైపు వరద ఉధృతిపై ఆదివారమే టూరిజం సిబ్బంది అప్రమత్తమయ్యారు. పర్యాటక శాఖ బోట్లను డ్రైవర్లు తాళ్లతో కట్టేశారు. జిల్లా అధికారులు నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు.

అక్కడికి ఎవరినీ వెళ్లకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. నదిలో ఎవరూ స్నానాలకు దిగవద్దని అధికారులు సూచించారు.

## ప్రకాశం బ్యారేజ్‌కు వరద ఉధృతి.. మంత్రి ఆదేశాలివే

అమరావతి, సెప్టెంబర్ 29: ప్రకాశం బ్యారేజ్‌కు వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. రేపల్లె , వేమూరు నియోజకవర్గ కరకట్టకు అనుకుని ఉన్న లంక గ్రామాల ప్రజలను అధికారులు నిరంతరం అప్రమత్తం చేయాలని ఆదేశించారు. కృష్ణానది కరకట్ట వెంబడి పరిస్థితిని అధికారులు ఎప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని రెవిన్యూ అధికారులకు, పోలీసులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కరకట్ట ప్రాంతంలో గండి పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కృష్ణా నది పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు నదిని గానీ, కాలువలను గానీ దాటే ప్రయత్నం చేయవద్దని.. ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. సోషల్ మీడియాలో జరిగే వదంతులను నమ్మవద్దన్నారు. ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు రాష్ట ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి అనగాని సత్య ప్రసాద్ స్పష్టం చేశారు. కాగా.. ప్రకాశం బ్యారేజీకి వరద భారీగా పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజ్ ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 6.81 లక్షల క్యూసెక్కులుగా ఉంది. దీంతో అధికారులు బ్యారేజీ 69 గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తి వరద నీటిని విడుదల చేశారు. వరద ఉధృతి నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంత అధికారులను రెవెన్యూ శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. విజయవాడ బెర్మ్‌పార్క్ వద్ద టూరిజం సిబ్బంది అప్రమత్తమైంది. పర్యాటకశాఖ బోట్లను డ్రైవర్లు తాళ్లతో కట్టేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండే వారితో పాటు లంక ప్రాంతం వాసుల్ని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. వరద ప్రవాహం నేపథ్యంలో అక్టోబర్ రెండున జరిగే దుర్గమ్మ తెప్పోత్సవం కేవలం నది ఒడ్డుకే పరిమితం చేసే అవకాశం ఉంది.

**సీఐఐ సదస్సుకు ఎల్జీ సంస్థకు ప్రత్యేక ఆహ్వానం**.. ఎల్జీ కార్యాలయానికి విచ్చేసిన మంత్రులు పి. నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డిల బృందానికి ఎల్జీ సంస్థ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి అంశాలను ఈ సందర్భంగా ఎల్జీ ప్రతినిధులకు మంత్రులు వివరించారు. అమరావతి/దక్షిణ కొరియా, సెప్టెంబర్ 29: దక్షిణ కొరియాలో ఏపీ మంత్రులు పి.నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డిల బృందం పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా ఎల్జీ కంపెనీ ప్రతినిధులతో మంత్రులు భేటీ అయ్యారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ ఎల్జీ సంస్థ హెడ్ క్వార్టర్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎల్జీ కార్యాలయానికి విచ్చేసిన మంత్రులు పి. నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డిల బృందానికి ఎల్జీ సంస్థ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి అంశాలను ఈ సందర్భంగా ఎల్జీ ప్రతినిధులకు మంత్రులు వివరించారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఎల్జీ సంస్థ ప్రతినిధులను మంత్రులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్‌లో సుస్థిర ప్రభుత్వంతో అభివృద్ధి తీరుతెన్నులు, పెట్టుబడిదారులకు ఉన్న అపార అవకాశాలపై మంత్రుల బృందం వివరించింది. ఈ సమావేశంలో అధికారులు ఎం.టీ.కృష్ణ బాబు, కాటంనేని భాస్కర్, ఈడీబీ అధికారులు పాల్గొన్నారు.

## 'ట్రూ డౌన్'పై మండలిలోనే ప్రకటన చేయాలనుకున్నాం.. కానీ: మంత్రి డోలా



మంగళగిరి: బాదుడే బాదుడు నినాదంలో 'ట్రూ అప్' పేరిట విద్యుత్ భారాన్ని ప్రజలకు జగన్ పరిచయం చేశారని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం 'ట్రూ డౌన్' పేరును పరిచయం చేస్తోందని చెప్పారు. మంగళగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు.. వీలైతేనే తగ్గిస్తామని చెప్పినట్లు గుర్తు చేశారు. కానీ, అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే చిత్తశుద్ధితో ఛార్జీలు తగ్గించి చూపించారని చెప్పారు.

హ్యాండ్‌ల్యూమ్స్, సెలూన్‌లకు సబ్సిడీ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. స్వలాభం కోసం అధిక మొత్తానికి విద్యుత్ కొనుగోలు చేసిన జగన్ ప్రభుత్వం.. వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిందని మండిపడ్డారు. శాసనమండలిలోనే ట్రూ డౌన్‌పై ప్రకటన చేయాలని భావించామని, అయితే, కాఫీ కోసం వైకాపా సభ్యులు గొడవ చేసి.. ముఖ్యమైన అంశం సభకు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు.

# ముద్దుగుమ్మకు మరో లైఫ్ అండ్ డెత్ మ్యాటర్..!

సినిమా ఇండస్ట్రీలో హీరోలకు, హీరోయిన్స్‌కి ప్రతి సినిమా లైఫ్ అండ్ డెత్ మ్యాటర్ అనడంలో సందేహం లేదు. ముఖ్యంగా కెరీర్ ఆరంభంలో ప్రతి సినిమా విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి, లేదంటే ఫ్లాప్ వచ్చి కెరీర్ మొత్తం నాశనం అయ్యే అవకాశాలు ఉంటాయి. అందుకే కెరీర్ ఆరంభంలో నటీనటుల ఎంపిక సరిగ్గా లేకుంటే మొత్తం కెరీర్ ఎఫెక్ట్ కావడం మనం చూస్తూ ఉన్నాం. కెరీర్ ఆరంభంలో రెండు మూడు వరుస హిట్స్ పడితే స్టార్‌డం దక్కించుకోవడం జరుగుతుంది. అదే కెరీర్ ఆరంభంలో ఫ్లాప్స్ పడితే కెరీర్‌లో ముందుకు సాగడమే కష్టం అవుతుంది. అందుకే బాలీవుడ్‌తో పాటు అన్ని భాషల ఇండస్ట్రీలోనూ హీరోయిన్స్ కెరీర్ పరంగా నిలదొక్కుకోవాలంటే మినిమం హిట్స్ పడాల్సిందే. కానీ జాన్వీ కపూర్ లక్కీగా పెద్ద హిట్స్ పడకున్నా తన అందంతో పాటు, తన బ్యాక్ గ్రౌండ్ కారణంగా ఇండస్ట్రీలో నెగ్గుకు వస్తున్న విషయం తెల్సిందే.



**జాన్వీ కపూర్ బాలీవుడ్ ఎంట్రీ...** శ్రీదేవి నటవారసురాలిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన జాన్వీ కపూర్‌కి మంచి ఆరంభం లభించింది. అయితే కమర్షియల్‌గా బిగ్ సక్సెస్‌లను దక్కించుకోవడంలో జాన్వీ కపూర్ విఫలం అయింది. అయినా కూడా సోషల్ మీడియాలో ఈమె అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు గుర్తింపు దక్కించుకుంటూ వచ్చింది. జాన్వీ కపూర్ అందంతో ఆకట్టుకోవడంతో సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంటూ ఉంది. ఆ మధ్య వచ్చిన పరమ్ సుందరి సినిమాతో జాన్వీ కపూర్ ఖచ్చితంగా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందని అంతా భావించారు. ఆమె కూడా పరమ్ సుందరి విషయంలో చాలా ఆసక్తిని పెంచుకుంది. కానీ నిరాశనే మిగిల్చిన విషయం తెల్సిందే. ఇప్పుడు ఈమె వరుణ్ ధావన్‌తో కలిసి 'సన్నీ సంస్కారికి తులసి కుమారి' సినిమాతో రాబోతున్న విషయం తెల్సిందే.

**రామ్ చరణ్ పెద్ది మూవీలో జాన్వీ కపూర్...** జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో ఇప్పటికే చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరుస్తూ వచ్చాయి. పరమ్ సుందరి మాదిరిగా ఈ సినిమా సన్నీ సంస్కారికి తులసి కుమారి సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిస్తే జాన్వీ కపూర్ కి హిందీలో ఆఫర్లు తగ్గే ప్రమాదం ఉందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అందుకే బాలీవుడ్‌లో జాన్వీ కపూర్‌కి ఈ సినిమా లైఫ్ అండ్ డెత్ మ్యాటర్ అన్నట్లుగా మారింది. కేవలం జాన్వీ కపూర్‌కి మాత్రమే కాకుండా వరుణ్ ధావన్ విషయంలోనూ ఇదే పరిస్థితి. ఆయన గత చిత్రాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచాయి. అందుకే ఈ సినిమా విషయమై ఆయన ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఉన్నారు. వీరిద్దరికీ ఈ సినిమా ఎంత ముఖ్యమో అనేది సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు నటనలో ప్రతిభ ఉన్న జాన్వీ కపూర్‌కి ఈ సినిమా, రామ్ చరణ్ తో చేస్తున్న పెద్ది సినిమా హిట్‌ను అందిస్తాయా అనేది చూడాలి.

# యాక్షన్ లోకి గుంటూరు పిల్ల!

మీనాక్షి చౌదరి కి చెప్పుకోవడానికి సక్సెస్ లున్నా? చేతిలో అవకాశాలు మాత్రం కనిపించడం లేదు. ప్రస్తుతం అనగనగా ఒక రోజు చిత్రంలో నటిస్తోంది. తెలుగులో నటిస్తోన్న ఒకే ఒక్క చిత్రమిది. ఇలాంటి సమయంలోనే పక్క పరిశ్రమలు అనుకోకుండా ఆదుకుంటాయి. అది మీనాక్షి విషయంలో కూడా ప్రూవ్ అవుతుంది. ఇటీవలే బాలీవుడ్ హిట్ ప్రాంచైజీ ఫోర్స్ లో ఛాన్స్ అందుకుంటున్నట్లు వార్తలొచ్చాయి. తాజాగా అది నిజమేనని కన్ఫమ్ అయింది. ఇప్పటి వరకూ మీనాక్షి బాలీవుడ్ లో లాంచ్ అవ్వలేదు. దీంతో ఇదే బాలీవుడ్ డెబ్యూ అవుతుంది.

**అలియాభట్ నో చెప్పడంతో:** ఇందులో అమ్మడు జాన్ అబ్రహంతో రొమాన్స్ చేయబోతుంది. అంతేకాదు మీనాక్షి పాత్ర పవర్ ఫుల్ గానూ ఉంటుంది. ఇది పూర్తి యాక్షన్ ప్యాక్డ్ చిత్రం కావడంతో మీనాక్షి పాత్ర కూడా యాక్షన్ తోనే నిండి ఉంటుంది. దీనిలో భాగంగా యాక్షన్ సన్నివేశాలకు సంబంధించి వర్క్ షాపులకు కూడా హాజరవుతుందన్నది




తాజా సమాచారం. నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది. ఈ నేపథ్యంలోనే మీనాక్షి పాత్రను ఫైనల్ చేసి వర్క్ షాప్ లు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ పాత్ర కోసం బాలీవుడ్ లో అలియాభట్ ని ట్రై చేసారు.

**ఇకపై బాలీవుడ్ పై ఫోకస్:** కానీ అలియా భట్ బిజీ షెడ్యూల్ కారణంగా డేట్లు ఇవ్వలేకపోయింది. దీంతో ఆ ఛాన్స్ మీనాక్షికి వరించింది. సరిగ్గా టాలీవుడ్ లో అవకాశాలు లేని సమయంలో వచ్చిన అవకాశం కావడంతో మీనాక్షి ఆనందంతో ఉబ్బితబ్బిబుతోంది. ఈ సినిమా సక్సెస్ అయితే అమ్మడు బాలీవుడ్ లో స్థిరపడే అవకాశాలున్నాయి. కెరీర్ టాలీవుడ్ లో మొదలైన ఏ నటి అయినా అంతిమంగా బాలీవుడ్ లో స్థిరపడాలనే గోల్ తోనే ఉంటారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో మీనాక్షి ఇకపై బాలీవుడ్ పై ఫోకస్ చేసే అవకాశం ఉంది.

**ఓ సంచలన ప్రాంచైజీ ఇది:** ఫోర్స్ బాలీవుడ్ హిట్ ప్రాంచైజీలో ఒక్కటి. ఏసీపీ యశ్వర్ధన్ సింగ్ పాత్రలో జాన్ ఫోర్స్ సినిమాతో ఎంత ఫేమస్ అయ్యాడు. అప్పటి నుంచి ఫోర్స్ అన్నది ఓ ప్రాంచైజీ గా మారిపోయింది. ఈ ప్రాంచైజీ నుంచి ఇప్పటి వరకూ రిలీజ్ అయిన రెండు చిత్రాలు మంచి విజయం సాధించాయి. ఈనేపథ్యంలో ఫోర్స్ 3పై భారీ అంచనాలు ఏర్పడు తున్నాయి. జాన్ అబ్రహం ఏసీపీ యశ్వర్ధన్ సింగ్ పాత్రను బలంగా నమ్మడంతో మరోసారి ఫోర్స్ ప్రాంచైజీని రీబూట్ చేస్తున్నారు. ఈసారి దర్శకత్వం బాధ్యతలు భావ్ దూలియాకు అప్పగించారు.




# సౌత్ ఇండస్ట్రీ దూకుడు.. టాప్ 10లో అన్నీ మనవే!




సౌత్ సినీ ఇండస్ట్రీ ఒకప్పుడు వేరు.. ఇప్పుడు వేరు.. పాన్ ఇండియా రేంజ్ లో అనేక దక్షిణాది సినిమాలు అదరగొడుతున్నాయి. అందరినీ ఆకట్టుకుని దూసుకుపోతున్నాయి. బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తున్నాయి. తద్వారా ఎన్నో రికార్డులు క్రియేట్ చేస్తున్నాయి. ఇప్పటికే నమోదై ఉన్న రికార్డులు కూడా బద్దలుకొడుతున్నాయి. అదే సమయంలో ఓపెనింగ్స్ విషయంలో గట్టిగా పోటీపడుతున్నాయి. తొలి రోజు వరల్డ్ వైడ్ గా భారీ వసూళ్లను రాబడుతున్నాయి. అయితే రీసెంట్ గా టాప్-10 హెయ్యెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన ఇండియన్ మూవీస్ లిస్ట్ లోకి టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ మూవీ వచ్చి చేరింది. ఫస్ట్ డే ఆ సినిమా.. రూ. 154 కోట్లు సాధించింది. తద్వారా టాప్ ఓపెనింగ్ సాధించిన సినిమాల జాబితాలో 8వ స్థానంలో నిలిచింది. అంతేకాదు నార్త్ కు చెందిన బ్లాక్ బస్టర్ హిట్లు రణబీర్ కపూర్ యానిమల్ (రూ.116 కోట్లు), షారుఖ్ ఖాన్ జవాన్ (రూ.128 కోట్లు) చిత్రాలకు షాక్ ఇచ్చింది.

అయితే గత ఏడాది రిలీజైన పుష్ప 2 సినిమా ఇంకా టాప్ ప్లేస్ లోనే కొనసాగుతోంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటించిన ఈ సినిమా తొలి రోజే రూ. 294 కోట్లు ప్రపంచవ్యాప్తంగా రాబట్టింది. ఆ తర్వాత టాలీవుడ్ స్టార్ హీరోలు జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ ఆర్ఆర్ఆర్ డే 1 వరల్డ్ వైడ్ గా రూ. 223 కలెక్ట్ చేసి రెండో ప్లేస్ లో నిలిచింది. మరి ఆ లిస్ట్ లో టాప్ 10 లో ఉన్న సినిమాల వివరాలు ఇలా!

**టాప్ 10 అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాలు...** పుష్ప 2- రూ. 294 కోట్లు, ఆర్ఆర్ఆర్ - రూ. 223 కోట్లు, బాహుబలి ది కంక్లూజన్ - రూ. 217 కోట్లు, కల్కి 2898 ఏడీ - రూ. 191.50 కోట్లు, సలార్ - రూ. 178.50 కోట్లు. దేవర - రూ. 172 కోట్లు, కేజీఎఫ్ 2 - రూ.165 కోట్లు, ఓజీ- రూ. 154 కోట్లు, కూలీ - రూ.153 కోట్లు, లియో - రూ. 143 కోట్లు. అయితే పై లిస్ట్ చూసుకుంటే.. సౌత్ ఇండస్ట్రీ దూకుడు ఎలా ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. టాప్ 10 లిస్ట్ లో మొత్తం దక్షిణాది సినిమాలే ఉన్నాయి. ఒక్కటంటే ఒక్కటి కూడా బాలీవుడ్ మూవీ లేదు. మరో ప్రత్యేక విషయమేమంటే.. అత్యధికంగా తెలుగు సినిమాలే ఏడు ఉన్నాయి. టాప్ 5 సినిమాలు మొత్తం టాలీవుడ్ వే కావడం విశేషం.

# మన శంకరవరప్రసాద్.. ఈసారి అనిల్ కు అంత ఈజీ కాదండోయ్!





గత 10ఏళ్లుగా టాలీవుడ్ లో కామెడీ ఎంటర్టైనర్ లకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తున్నారు అనిల్ రావిపూడి. పంచ్ డైలాగులు, కామెడీ కామెడీ టైమింగ్ తో ఫ్యామిలీ ఆడియెన్స్ ను ఆకట్టుకోవడంలో అనిల్ సక్సెస్ అయ్యారు. కొన్నేళ్లుగా ఫ్యామిలీ ఎంటర్టైనర్ లు తెరకెక్కిస్తూ పండగ సీజన్ లో సినిమాలు విడుదల చేస్తున్నారు. అలా పండక్కి వస్తూ హిట్ సాధిస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి విక్టరీ వెంకటేశ్ తో సంక్రాతికి వస్తున్నాం సినిమా తీశారు. రామ్చరణ్ గేమ్చేంజర్, బాలకృష్ణ డాకు మహారాజ్ సినిమాలతో పోటీగా రిలీజ్ చేశారు.

అలాంటి రెండు యాక్షన్ సినిమాలను కాదని, ప్రేక్షకులు అనిల్ సినిమాకు బ్రహ్మరథం పట్టారు. ఈ సినిమా ఊహించని రేంజ్ లో వసూళ్లు సాధించి... పండగ విన్నర్ గా నిలిచింది. ఈసారి కూడా ఆయన అదే ఫార్ములాతో వస్తున్నారు. ప్రస్తుతం అనిల్.. మెగాస్టార్ చిరంజీవితో మనశంకర వరప్రసాద్ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా కూడా వచ్చే ఏడాది సంక్రాతి రిలీజ్ చేస్తున్నారు. అయితే ఈసారి అనిల్ కు అంత ఈజీ కాకపోవచ్చు. ఎందుకంటే, అదే కామెడీ ఫ్యామిలీ ఎంటర్టైనర్ జానర్‌లో మరో రెండు సినిమాలు పొంగల్ ఫైట్ లో ఉండడమే అందుకు కారణం. అందుకే ఈసారి కాంపిటీషన్ ఫుల్ గా ఉండనుంది. ఈ లైనప్ లో నవీన్ పోలిశెట్టి అనగనగా ఒక రాజు, ప్రభాస్ హర్రర్ కామెడీ రాజాసాబ్ సినిమాలు బరిలో ఉన్నాయి. ఇలా ఒకటి కంటే ఎక్కువ సినిమాలు కామెడీ జానర్‌ను నమ్ముకొని రావడంతో మార్కెట్ స్ప్లిట్ అవుతుంది. అంటే సినిమాలు మార్కెట్ ను పంచుకుంటాయన్న మాట. ఏ ఒక్క సినిమాకు కూడా వన్ సైడ్ ఆక్యుపెన్సీ ఉండదు. అందుకే ఈసారి పండగకు ప్రేక్షకులు కామెడీనే కాదు సినిమాలో మరిన్ని ఎలిమెంట్స్ ఉండాలని కోరుకుంటారనడంలో సందేహం లేదు. అది చిరు- అనిల్ సినిమాను ఇరకాటంలో పెట్టవచ్చు. అలా అనిల్ కు ఈ సీజన్ కాస్త భిన్నంగా మారనుంది. అయినప్పటికీ.. అనిల్ - చిరంజీవి కాంబోకు ఉండాల్సిన బజ్ అయితే ఉంది. కేవలం ఇక్కడ అనిల్ డీసెంట్ కంటెంట్ ను డెలివరీ చేయలగితే పొంగల్ ఫైట్ లో మరోసారి విజేతగా నిలిచే ఛాన్స్ ఉంటుంది.

# క్వీన్ ఆఫ్ బ్యూటీ అనసూయ భరద్వాజ్

అనసూయ భరద్వాజ్ ఎప్పటికప్పుడు తన ఫ్యాషన్ ఫోటోషూట్లతో, లైఫ్ స్టైల్ అప్‌డేట్స్‌తో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన స్విమ్మింగ్ పూల్ ఫోటోలు నెట్టింట్లో చర్చనీయాంశంగా మారాయి. బ్లాక్ స్విమ్ సూట్‌లో ఐస్లాండ్ చల్లని వాతావరణంలో ఆనసూయ సేదతీరుతున్న ఫోటోలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. సన్ గ్లాసెస్‌తో స్టైలిష్‌గా, ఫ్రెష్‌గా కనిపించిన ఆమె లుక్స్ ఫ్యాన్స్‌కి కొత్త అనుభూతిని కలిగిస్తున్నాయి. దీంతో బికినీ కంటే ఘాటుగా ఆ లుక్స్ ఉన్నాయని కొందరు పాజిటివ్ గా రెస్పాండ్ అవుతున్నారు. ఇక ఇప్పటికే నటిగా అనసూయ మంచి క్రేజ్ అందుకుంది. ఆమె బుల్లి తెరపై యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి, టాప్ టెలివిజన్ హోస్ట్‌గా పేరు సంపాదించింది. ముఖ్యంగా "జబర్దస్త్"



వంటి షోల ద్వారా బుల్లితెర ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఆ తరువాత సినిమాల్లో కూడా తన ప్రతిభను చూపించింది. రంగస్థలం, పుష్ప వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రత్యేకంగా పుష్ప సినిమాలో అనసూయ, తన నెగటివ్ షేడ్స్‌తో కూడిన నటనకు మంచి ప్రశంసలు అందుకుంది. ఇక టెలివిజన్‌లో మాత్రమే కాదు, వెబ్‌సిరీస్‌లు, సినిమాలు, స్టేజ్ షోలు ఇలా విభిన్న రంగాల్లో తన ప్రతిభను రుజువు చేస్తూ ముందుకు సాగుతోంది. సోషల్ మీడియాలో అనసూయ ఎప్పటికప్పుడు తన వ్యక్తిగత జీవితంలోని చిన్నచిన్న క్షణాలను, ఫ్యాషన్ లుక్స్‌ని పంచుకుంటూ అభిమానులతో కనెక్ట్ అవుతోంది. ఇక లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన ఈ పూల్ ఫోటోలు కొన్ని నిమిషాల్లోనే వేల లైక్స్ సంపాదించాయి. క్వీన్ ఆఫ్ బ్యూటీ అంటూ ఎప్పటికప్పుడు సర్ప్రైజ్ చేసే లుక్స్ ఇస్తోందిని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# స్టార్ రేంజ్ ఉన్న వాళ్లతో అమ్మడు పోటీ..!

ఓజీ సినిమా చూసిన తర్వాత శ్రీయా రెడ్డి గురించి మాట్లాడకుండా ఉండలేరు. నిడివి తక్కువ ఉన్న రోల్ అయినా ఆమె తన మార్క్ చూపించారు. ఓజీ సినిమాలో శ్రీయా రెడ్డిని కావాలని తీసుకున్నాడు సుజిత్. ఎందుకంటే నెగిటివ్ రోల్ చేసే వాళ్లు చాలా తక్కువమంది ఉంటారు. మేల్ విలన్ దొరుకుతారు కానీ లేడీ విలన్ అంటే కాస్త ఆలోచిస్తారు. కానీ కెరీర్ మొదట్లోనే శ్రీయా రెడ్డి ఆ స్టెప్ తీసుకున్నారు. సౌత్ లో లేడీ విలన్ అనగానే అందరికీ నరసిం హ సినిమాలో రమ్యకృష్ణ గుర్తొస్తారు. ఐతే ప్రస్తుతం శ్రీయా రెడ్డి కూడా అంత ఇంపాక్ట్ చూపించారు.

**వేళ్లతో లెక్క పెట్టే సినిమాలు..** సలార్ లో కూడా ఆమె చేసిన పాత్ర సర్ ప్రైజ్ చేస్తుంది. ఐతే శ్రీయా రెడ్డి దాదాపు రెండు దశాబ్దాలుగా సినిమాలు చేస్తున్నా కేవలం సెలెక్టెడ్ ప్రాజెక్ట్స్ మాత్రమే ఆమె అందుకుంటుంది. అందుకే ఆమె వేళ్లతో లెక్క పెట్టే సినిమాలే చేసింది.



ఐతే సలార్ 1, ఓజీ సినిమాల్లో మళ్లీ ఆయన నెగిటివ్ షేడ్స్ ఆడియన్స్ ని మెప్పించాయి. ఇలాంటి రోల్స్ కి ఆమె పర్ఫెక్ట్ ఛాయిస్ అని భావిస్తున్నారు. ఈమధ్య వరలక్ష్మి శరత్ కుమార్ కూడా లేడీ విలన్ గా చేసినా శ్రీయా రెడ్డి ఎందుకో స్పెషల్ గా అనిపిస్తారు. ఐతే ఓజీ చూశాక ఆమెకు ఇలాంటి ఆఫర్స్ ఎన్నో వచ్చే ఛాన్స్ ఉంది. కానీ ఆమె అన్నిటికీ ఓకే చెప్పదట. తను నెగిటివ్ రోల్ లేదా సినిమాలో నటించాలంటే పాత్రతో పాటు స్టార్ ఇమేజ్ ఉన్న హీరోలు మాత్రమే కావాలని అంటుంది. స్టార్ సినిమాలు మాత్రమే చేస్తానంటుంది కాబట్టే ఆమెకు సరైన అవకాశాలు లేవని చెప్పొచ్చు. నటిగా తనని తాను ప్రూవ్ చేసుకునేందుకు తన పాత్ర వరకు డిమాడ్ ఓకే కానీ అది స్టార్ సినిమానే అయ్యుండాలని చెప్పడం కెరీర్ మీద ఇంపాక్ట్ చూపిస్తుంది.

**శ్రీయా రెడ్డి కండీషన్స్..** ఓజీ తర్వాత మళ్లీ శ్రీయా రెడ్డి తిరిగి ఫాం లోకి వచ్చేలా ఉన్నా వచ్చిన సినిమాల్లో కథ ఆమె పాత్ర చూస్తే ఓకే కానీ స్టార్ ఉన్నాడా లేదా అన్నది పట్టించుకుంటే మరో ఛాన్స్ రావడం కష్టమే. మరి శ్రీయా రెడ్డి ఈ ఒక్క కండీషన్ ని పక్కన పెడితే మాత్రం ఆమె కోసం కొత్త పాత్రలు రాసి మరీ అవకాశం ఇచ్చేలా ఉన్నారని చెప్పొచ్చు. ఎలాగు సలార్ 2 లో ఆమె పాత్ర ఉంటుంది. దానికి తోడు మరికొన్ని అవకాశాలు వస్తే శ్రీయా రెడ్డి కెరీర్ ఫాం లోకి వస్తుంది. శ్రీయా రెడ్డి కోలీవుడ్ హీరో విశాల్ కి వదిన అనే విషయం తెలిసిందే. విశాల్ పొగరు సినిమాలో ఆమె విలన్ గా నటించి మెప్పించారు.




హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎన్నికలు ఏవైనా తమ పార్టీ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటుందని చెప్పారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఏ ఎన్నికైనా తమకు అనుకూలమే అని చెప్పారు.

"కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలు మర్చిపోయారని అనుకుంటోంది. వారి గ్యారంటీ కార్డులను గుర్తుచేసేందుకు.. మేము 'బాకీ కార్డులను' తీసుకువచ్చాం. వీటిద్వారా ఆ పార్టీ బాకీలను ఇంటింటికీ చేర్చడానికి ఉద్యమించాం. 'బాకీ కార్డులు' ఇంటింటికి తీసుకుపోతే, అదే కాంగ్రెస్ పాలిట బ్రహ్మాస్త్రం. కేసీఆర్‌ను తిరిగి తెచ్చుకోవాలనే ఆలోచన ప్రజల్లో కనిపిస్తోంది. ఉన్న హైదరాబాద్ నగరాన్ని ఉద్ధరించే పరిస్థితి లేదు.. కానీ కొత్త నగరాన్ని కడతామని పోజులు కొడుతున్నారు. మున్సిపల్ శాఖ విషయంలో సీఎం రేవంత్ పూర్తిగా విఫలమయ్యారు" అని కేటీఆర్ విమర్శించారు.




టీజీఎస్ఆర్టీసీ ఎండీగా తన చివరి రోజున వీసీ సజ్జనార్ ప్రజా రవాణాపై తన అనుబంధాన్ని వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. సాధారణ ప్రయాణికుడిలా లక్డీకాపుల్ – టెలిఫోన్ భవన్ బస్టాండ్ నుంచి బస్‌భవన్ వరకు 113 I/M రూట్ బస్సులో ప్రయాణించారు. యూపీఐ పేమెంట్ చేసి కండక్టర్ వద్ద సొంత ఖర్చుతో టికెట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో ముచ్చటించారు. వీసీ సజ్జనార్ హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బదిలీపై వెళుతున్న సంగతి తెలిసిందే.

## బీసీలకు దసరా కానుకగా 42% రిజర్వేషన్లు: తెలంగాణ మంత్రులు




హైదరాబాద్, సెప్టెంబర్ 29: ప్రజలందరికీ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం గాంధీభవన్‌లో మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. దసరా కంటే ముందే బీసీ బిడ్డలకు పండుగ వాతావరణం వచ్చిందన్నారు. మాతృమూర్తికి ప్రసవ వేదన అనేది ప్రకృతి ఇచ్చిన వరమని.. అలాగే 42 శాతం రిజర్వేషన్లు బీసీ బిడ్డలకు ఇచ్చిన వరంగా పేర్కొన్నారు. 'మేము ఎంతో మాకు అంతా వాటా' అని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కులగణన చేశారని.. కులగణన ఆధారంగా బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని... ఎవరి నోటి కాడ ముద్ద లాక్కోవడం లేదని స్పష్టం చేశారు. వాస్తవానికి బీసీలకు రిజర్వేషన్లలలో ఇంకా వాటా రావాలి కానీ కుదించుకొని 42 శాతం రావాలి అని అడుగుతున్నామని చెప్పుకొచ్చారు. పార్టీ మెప్పు కోసం, నాయకుల మెప్పు కోసం ఎవరూ మాట్లాడి సమాజంలో తలవంపులు తెచ్చుకోవద్దని అన్ని పార్టీల బీసీ నాయకులకు తాము కోరుతున్నామన్నారు. ఇది న్యాయపరమైన కోరికగా వెల్లడించారు. రిజర్వేషన్లు అమలు కాకపోతే బీసీ బిడ్డలు ఇంకా వెనకబడిపోతారన్నారు. జయలలిత బీసీ రిజర్వేషన్లు పెంచి 9 షెడ్యూలు పెట్టినప్పుడు జయలలిత పార్టీ కేంద్రంలో అధికారంలో లేదని తెలిపారు. రాష్ట్రాల్లో ప్రజలు కోరుకుంటున్నారు కాబట్టి కేంద్రం బిల్లుకు ఆమోదం తెలపాలని అన్నారు. 'అంతేకాని మీరే హామీ ఇచ్చారు.... మీరే చేయాలి అని బట్ట కాల్చి మీద వేస్తాం అంటే ఎలా?' అని మండిపడ్డారు. రాష్ట్ర పరిధిలో ఉన్న అన్ని ప్రయత్నాలు చేశామని.... ఇప్పుడు కేంద్రం చేయాలన్నారు. అది చేయక పోగా అనుమానాలు ఉన్నాయి అంటున్నారని... అనుమానాలు ఉంటే వ్యక్తం చేయమని కూడా చెప్పామన్నారు. అవేమీ చేయకుండా బీజేపీ నాయకులు కాళ్లలో కట్టె పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

బీసీ బిడ్డలందరికీ పోటీ చేసే అవకాశం దొరికింది... దయచేసి అన్ని వర్గాలు సహకరించాలని, 42 శాతం రిజర్వేషన్లు వ్యతిరేకించి బీసీ బిడ్డల ఆగ్రహానికి గురికావద్దని మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీహరి కోరారు.

## స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురువేస్తాం:రాంచందర్ రావు

హైదరాబాద్, సెప్టెంబరు29: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను ఇవాళ(సోమవారం) విడుదల చేసింది తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగనున్నాయి. ఆ తర్వాత వార్డులు, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనుంది ఎన్నికల సంఘం. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదల అనంతరం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడారు. ఆలస్యమైనా తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తుందని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రపతి , గవర్నర్‌ల పేరిట కాలయాపన చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. రెండేళ్లకే కాంగ్రెస్ మీద ప్రజలకు విరక్తి కలిగిందని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వం మీద ప్రజలు విసిగిపోయారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురువేస్తామని ధీమా వ్యక్తం చేశారు రాంచందర్ రావు. తమ గెలుపునకు స్థానిక సంస్థల ఎన్నికలే నిదర్శనం కాబోతున్నాయని ఉద్ఘాటించారు. తమకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది



ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని గుర్తుచేశారు. తాను స్వయంగా ఇప్పటివరకు 23 జిల్లాల్లో యాత్రలు చేశానని తెలిపారు. ఇంకో నాలుగు జిల్లాల్లో యాత్ర చేయాల్సి ఉందని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను తామే గెలువబోతున్నామని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.




## పాక్ ప్రధానికి ఊహించని షాక్.. పీఓకేలో తిరగబడ్డ ప్రజలు..

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు ఊహించని షాక్ తగిలింది. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసనలు చేపట్టారు. అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. సోమవారం వందలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రధాని షరీఫ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీలు చేపట్టారు. ముజఫరాబాద్, రావల్‌కోట్‌తోపాటు పలు ప్రాంతాల్లో స్కూళ్లు, షాపులు, ఇతర వ్యాపారాలు మూతపడ్డాయి. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు పూనుకున్నారు. వీలైనంత త్వరగా నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకురావాలని షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఎలక్ట్రిసిటీ టారిఫ్‌లు తగ్గించాలని, నిత్యావసర వస్తువులపై సబ్సిడీ ఇవ్వాలని అడుగుతున్నారు. కాశ్మీర్ శరణార్థులకు కేటాయించిన 12 అసెంబ్లీ స్థానాలను కూడా తీసేయాలని పట్టుబడుతున్నారు. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎన్నికల హామీలను వీలైనంత త్వరగా నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక, నిరసనల నేపథ్యంలో షరీఫ్ ప్రభుత్వం అలెర్ట్ అయింది. పరిస్థితులు చెయ్యి దాటి పోకుండా ఉండటానికి చర్యలు మొదలెట్టింది. పీఓకేలోని పలు ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేసింది. పెద్దఎత్తున భద్రతా దళాలను రంగంలోకి దించింది. పంజాబ్ నుంచి వేల మంది సైనికులు పీఓకేకు వెళ్లారు. శనివారం, ఆదివారం ప్రముఖ సిటీలకు వెళ్లే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను ఆర్మీ మూసివేసింది. ఏఏసీ కీలక నేత షౌకత్ నవాజ్ మిర్ మాట్లాడుతూ.. 'మేము ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయటం లేదు. గత 70 ఏళ్లుగా మాకు అందకుండా పోతున్న ప్రాథమిక హక్కుల కోసం పోరాటం చేస్తున్నాం' అని అన్నారు. ఇక, ఏఏసీ నాయకులు, ప్రభుత్వానికి మధ్య చర్చలు జరుగుతున్నాయి. కానీ, చర్చలు మాత్రం ఓ కొలిక్కి రావటం లేదు.




హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద సినిమా పైరసీ ముఠాను తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. ముఠాకు చెందిన ఆరుగురిని అరెస్టు చేశారు. తెలుగు సహా పలు భాషల సినిమాలను పైరసీ చేసినట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలను హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ ముఠా పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు రూ.3,700 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. దీనివల్ల నిర్మాతలు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. "టెలిగ్రామ్ ఛానల్స్, టొరెంట్స్ ద్వారా సినిమాల పైరసీ జరుగుతోంది. కొత్తగా ఎంవో విధానంలోనూ చేస్తున్నారు. థియేటర్‌కు వెళ్లి కెమెరా ద్వారా రికార్డింగ్ చేసి పైరసీకి పాల్పడుతున్నారు. అందరూ విస్తుపోయేలా డిజిటల్ శాటిలైట్‌ను కూడా హ్యాక్ చేసి పైరసీ చేస్తున్నారు. పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేసి బెట్టింగ్, గేమింగ్ యాప్ ప్రకటనల ద్వారా ఆదాయం పొందుతున్నారు. 'సింగిల్', 'హిట్' సినిమాల పైరసీ జరిగినప్పుడు మాకు ఫిర్యాదులు అందాయి.

పైరసీ కేసులో జానా కిరణ్‌కుమార్ అనే వ్యక్తి ప్రధాన నిందితుడు. సినిమాకు వెళ్లి కెమెరా ద్వారా రికార్డింగ్ చేసి టెలిగ్రామ్ ఛానల్ ద్వారా మరొకరికి పంపించాడు. హైఎండ్ కెమెరా ఉన్న సెల్‌ఫోన్‌తో నిందితులు సినిమాను రికార్డింగ్ చేస్తారు. సెల్‌ఫోన్లను జేబులో గానీ, పాప్‌కార్న్ డబ్బాలో గానీ పెడతారు. కిరణ్ ముఠా ప్రత్యేకమైన యాప్ ద్వారా సినిమాలను పైరసీ చేసింది. రికార్డింగ్ చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్ స్క్రీన్‌లైట్ కూడా ఆఫ్‌లో ఉంటుంది. దీంతో ఎవరికీ అనుమానం రాదు. ఇతర భాషల చిత్రాలను రికార్డింగ్ చేసేందుకు ఏజెంట్లు కూడా ఉన్నారు. సినిమా పైరసీలకు నెదర్లాండ్స్‌కు చెందిన ఐపీ అడ్రస్ వాడుతున్నారు. ఈ ముఠాను పట్టుకునేందుకు అత్యాధునిక టెక్నాలజీని వినియోగించాం.

పోలీసులు ఎప్పటికీ పట్టుకోలేని టెక్నాలజీ వాడుతున్నామని నిందితులు పేర్కొన్నారు. మేం కేసును ఛేదించిన విధానం తెలిసి షాక్ అయినట్లు నిందితుడు చెప్పాడు. అతడికి బెట్టింగ్ యాప్‌ల నుంచి నెలకు సుమారు రూ.9 లక్షల వరకు చెల్లింపులు జరిగాయి.

**డిజిటల్ మీడియా సర్వర్స్ మొత్తం హ్యాక్ చేసే నైపుణ్యం...** క్రిప్టో కరెన్సీ పేమెంట్స్ ద్వారా మాకు కొంత క్లూ దొరికింది. మరో ప్రధాన నిందితుడు పట్నాకు చెందిన అశ్వనీకుమార్ హ్యాకింగ్‌లో నిపుణుడు. డిజిటల్ మీడియా సర్వర్స్ మొత్తం హ్యాక్ చేసే నైపుణ్యం అతడికి ఉంది. కొన్ని సందర్భాల్లో గవర్నమెంటు వెబ్‌సైట్లను కూడా హ్యాక్ చేశాడు. ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌ను కూడా హ్యాక్ చేశాడు. ప్రభుత్వ వెబ్‌సైట్లు హ్యాక్ చేసి ఉద్యోగులు, జీతాల వివరాలు పొందగలిగాడు. బిహార్‌లో ఉన్న అతని ఇంటికి మా టీమ్ వెళ్లింది. అతని ఇంటికి 22 సీసీటీవీ కెమెరాలు పెట్టుకున్నాడు. పట్నాలో కూర్చుని పలు కంపెనీల సైట్లను హ్యాక్ చేశాడు. నిందితుల వల్ల పలు కంపెనీలు వాళ్ల ఉద్యోగులను అనుమానించే పరిస్థితి వచ్చింది. సినిమాల పైరసీని ప్రధానంగా ప్రోత్సహిస్తున్నది.. బెట్టింగ్, గేమింగ్ యాప్ నిర్వాహకులు. పైరసీ సైట్లలోని లింక్‌లను క్లిక్ చేస్తే యూజర్ వివరాలన్నీ పైరసీ ముఠాకు వెళ్తాయి. డిజిటల్ మీడియా హౌస్‌లు జాగ్రత్తగా ఉండాలి. సినిమా ఫుటేజీని భద్రపరచుకోవడంలో జాగ్రత్తగా ఉండాలి. సర్వర్‌కు ఒక ప్రొటెక్షన్ చేస్తే.. మరో మార్గంలో వస్తారు. ఎక్కువ సినిమాల పైరసీ కిరణ్, అశ్వనీకుమార్ ముఠా వల్లే జరిగింది.

**పైరసీ ద్వారా లక్ష డాలర్ల వరకు ఆర్జన...** నిందితులు ఈసీ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి ఎన్నికల జాబితాను మాత్రమే చూశారు. పైరసీ ద్వారా నిందితులు లక్ష డాలర్ల వరకు సంపాదించారు. ఈటీవీ కంటెంట్‌ను హర్షవర్ధన్ అనే వ్యక్తి పైరసీ చేశాడు. అతడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. సినిమాలను పైరసీ చేయడంలో సమాజ సేవ ఏమీలేదు. పైరసీలు చేసి బెట్టింగ్ యాప్‌ల ద్వారా డబ్బు సంపాదించారు. సిరిల్ అనే వ్యక్తి నెదర్లాండ్, ప్యారిస్ ఐపీ అడ్రస్‌లు పెట్టి సినిమాలు పైరసీ చేసి అప్లోడ్ చేస్తున్నాడు. ఇతనికి బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు నెలకు రూ.9లక్షలు ఇస్తున్నారు. ఇప్పటి వరకు 500 సినిమాలు పైరసీ చేసినట్లు గుర్తించాం." అని సీవీ ఆనంద్ తెలిపారు.

## తెలంగాణకు ప్రత్యేక స్థానం తెచ్చిన పండగ బతుకమ్మ: ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 29: ప్రపంచంలోనే తెలంగాణకు ప్రత్యేక స్థానాన్ని తెచ్చిన పండగ.. బతుకమ్మ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. ప్రపంచంలో పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణలోనే ఉందని ఆయన పేర్కొన్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కొండపాక మండలం మర్పడ్గ శ్రీ విజయ దుర్గా సమేత శ్రీ సంతాన మల్లిఖార్జునస్వామివారిని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంతోపాటు.. ప్రత్యేక రాష్ట్ర సాధనతో ఈ పండుగలు విశ్వ విఖ్యాతమయ్యాయని చెప్పారు.

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైందో.. నాటి నుంచి ఈ బతుకమ్మకు చాలా గొప్ప గుర్తింపు వచ్చిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మని రాష్ట్ర పండుగగా జరుపుకున్నామన్నారు. ఏ దేశంలో ఉన్నా.. ఎక్కడున్నా తెలంగాణ వాళ్ళు చాలా గొప్పగా ఈ బతుకమ్మ పండగను జరుపుకుంటారని వివరించారు. ఈ పండుగ వెనుక సైన్స్ కూడా ఉందన్నారు. కొత్తగా



వచ్చిన వర్షపు నీటిలో కీటకాలు ఉంటాయని.. వాటిని శుభ్రం చేయటం కోసం తంగేడు, గునుగు పువ్వులను నీటిలో వేస్తారన్నారు. దీని వల్ల నీరు పరిశుభ్రమవుతుందని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని తాను ప్రార్థించానన్నారు.

ఈ రాష్ట్రం ఇంకా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికి బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు.




## బిగ్ బ్రేకింగ్.. స్థానిక ఎన్నికల్లో ఆ నిబంధన.. వారు పోటీకి అనర్హులు

హైదరాబాద్, సెప్టెంబరు29 : స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను ఇవాళ(సోమవారం) విడుదల చేసింది తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగనున్నాయి. ఆ తర్వాత వార్డులు, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనుంది ఎన్నికల సంఘం. అయితే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్నవారు పోటీకి అనర్హులని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. కాగా, ముగ్గురు పిల్లల నిబంధనను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎత్తివేశారు. కానీ తెలంగాణలో మాత్రం ముగ్గురు పిల్లల నిబంధన ఇంకా మారలేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి దిగాలనుకునేవారు ఆలోచనలో పడ్డారు. అయితే ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో ఈ నిబంధనను తెలంగాణ ప్రభుత్వం ఎత్తివేసిందో లేదోనని పలువురు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com